ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 61
శనివారం 3 ఆగస్టు 2024
చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్
HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## భారత్-శ్రీలంక తొలి వన్డే టై

రెండు బంతుల్లో మారిన ఫలితం



.. వివరాలు 2లో



# కేంద్ర-రాష్ట్రాల మధ్య వారధిగా గవర్నర్లు

గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలి

ఢిల్లీలో గవర్నర్ల సదస్సులో మోదీ పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 2 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమర్థవంతమైన వారధి నిర్మించేందుకు గవర్నర్లు కీలక పాత్ర పోషించాలని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో గవర్నర్ల సదస్సునుద్దేశించి ఆయన ప్రసంగించారు. అణగారిన వర్గాలకు న్యాయం లభించే విధంగా ప్రజలు, సామాజిక సంస్థలతో సంప్రదింపులు జరపాలని సూచించారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పరిధిలోనే ప్రజలకు సేవ చేసేందుకు ఏర్పర్చిన ముఖ్యమైన వ్యవస్థ అని ఆయన

మిగతా 2 లో



# జాబ్ క్యాలెండర్ విడుదల

నోటిఫికేషన్లు..పరీక్షలు.. తేదీల వివరాలు ప్రకటన

అసెంబ్లీలో ప్రకటించిన డిప్యూటి సిఎం భట్టి

గతంలో అస్తవ్యస్త విధానాలతో నిరుద్యోగులకు నిరాశ

ఇచ్చిన హామీ మేరకు ముందుకు వెళుతున్నామని వెల్లడి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏయే ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేయాలనే విషయాలను క్యాలెండర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసే నెల, పరీక్షలు ఎప్పుడు నిర్వహించాలనే వివరాలతో పాటు నియామకాలు నిర్వహించే ఏజెన్సీ, ఉద్యోగానికి కావాల్సిన అర్హతల గురించి అందులో పొందుపర్చారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు.

హైదరాబాద్,ఆగస్ట్2 : జాబ్ క్యాలెండర్ ప్రకారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలు అక్టోబరులో, గ్రూప్-2ను డిసెంబరులో, గ్రూప్-3 నవంబరులో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్దం పాటు

మిగతా 2 లో

# టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు

తెలంగాణ సాధనలో వారి పాత్ర కీలకం

25వేలమందికి పదోన్నతులు కల్పించాం

ఒకటో తేదీన జీతాలు పడేలా చేస్తున్నాం

పేదల చదువుతోనే తెలంగాణకు భాగ్యం

సర్కారీ బడికి వెళ్లడం ఆత్మగౌరవంగా భావించాలి

పాఠశాలలకు ఉచిత విద్యుత్..మౌళిక వసతుల కల్పన

ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో భేటీలో సిఎం రేవంత్

తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని ఉద్ఘాటించారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నాడు 30 వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

హైదరాబాద్,ఆగస్ట్ 2 : ఉపాధ్యాయులే తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌లు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 25వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. 30 వేల మందిని బదిలీ చేశాం. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు మీ ఖాతాలో పడేలా చూసే బాధ్యత మాది. ఈ సమ్మేళనంలో రాజకీయం, స్వప్రయోజనం లేదు. తెలంగాణ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవం అని తల్లిదండ్రులు భావించాలి. అందుకు అందరం కలిసి కృషి చేయాలి. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను

మిగతా 2 లో



# హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతాం

నాలాలు, భూముల కబ్జాలపై ఉక్కుపాదం

గంజాయి పేరు చెబితేనే వణకాలి

శాంతిభద్రతలపై రాజీ పడే ప్రసక్తి లేదు

మూసీ రివర్ ఫ్రంట్‌తో నగరానికి వన్నె

హైడ్రా ద్వారా సమగ్ర ప్రణాళిక అమలు

శాసనసభలో స్వల్పకాలిక చర్చలో సిఎం రేవంత్



# మార్పు పేరుతో... ప్రజలను ఏమార్చలేరు

ఉద్యోగాలు ప్రకటించకుండానే నిరుద్యోగులకు మోసం

ప్రజలు తిరగబడే రోజు తప్పకుండా వస్తుంది

గన్‌పార్క్ వద్ద నిరసనలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్

## జాబ్ క్యాలెండర్ పేరుతో మరోమారు మోసం

హైదరాబాద్,ఆగస్ట్2 : మార్పు మార్పు అంటూ తెలంగాణ ప్రజలను ఎక్కువ రోజులు ఏమార్చలేరని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పకుండా ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన నిరసనలు

మిగతా 2 లో

# బయటికిరా.. తోలు తీస్తా

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో దానం

ఇక్కడే చూసుకుందాం: కౌశిక్

అక్బరుద్దీన్ సూచనతో క్షమాపణ కోరిన దానం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి దానం వ్యాఖ్యలు

బయటెందుకు ఇక్కడే చూసుకుందాం.. రా: కౌశిక్ రెడ్డి





హైదరాబాద్, ఆగస్టు 2 : చివరిరోజైన శుక్రవారం శాసనసభలో తీవ్ర దుమారం చెలరేగింది. జాబ్ క్యాలెండర్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రకటన అనంతరం.. జాబ్ క్యాలెండర్‌పై మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ సభాపతిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ కోరగా తిరస్కరించారు. దీనిపై కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అరుస్తూ సభను అడ్డుకునేందుకు యత్నించారు. ప్రకటనపై చర్చ ఉండదంటూ శాసనసభ నియమావళిని భట్టి చదివి వినిపించారు. అయినప్పటికీ

మిగతా 2 లో



# కాంగ్రెస్‌లోనే ఎమ్మెల్యే బండ్ల..

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కృష్ణమోహన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 2 : గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మళ్లీ కాంగ్రెస్ చెంతకు చేరారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి.. తాను కాంగ్రెసలోనే కొనసాగుతానని చెప్పారు. ఓవైపు శాసనసభ సమావేశాలు జరుగుతుండగా.. కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం బీఆర్ఎసఎల్పీ కార్యాలయానికి వెళ్లడంతో ఆయన తిరిగి సొంత గూటికి చేరుకున్నారనే ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికెళ్లి మాట్లాడటంతోపాటు ఆయనను తన వెంటే హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. శుక్రవారం మంత్రి జూపల్లి ఆధ్వర్యంలోనే కృష్ణమోహనరెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 3 ఆగస్టు 2024





# టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు



### మొదటి పేజీ తరువాయి

నియమిస్తాం. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తాం.. ఆ బిల్లు ప్రభుత్వమే చెల్లిస్తుంది. పేద పిల్లలు, దళిత వర్గాల పిల్లలు చదువుకుని బాగు పడితేనే రాష్ట్రం బలపడుతుంది. దిల్లీలో మూడుసార్లు కేజ్రీవాల్ గెలిచింది బస్తీల్లో పాఠశాలలు మెరుగుపరచడం వల్లే. మళ్లీ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఉండాలంటే మీరు పేదలకు చదువు చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థులు ఉన్నారని... తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని వివరించారు. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందనుకున్నాం.. ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందనుకున్నామని చెప్పారు. కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్య లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందని అనుకున్నామని కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరిగిందో చూశామని అన్నారు. గత పాలకులు ఉపాధ్యాయు లను ఏ విధంగా అవమానించారో చూశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించాం. కానీ హామీల అమలు దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా కేటాయించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో.. 26లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారు..10వేల ప్రైవేట్ పాఠశాలల్లో.. 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజం. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారు. ప్రభుత్వంపై

ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించాం. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు..మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నేను ఈ స్థాయికి చేరా. అలాంటి ప్రభుత్వ టీచర్లను కలుసుకునేందుకే ఈ ఆత్మీయ సమావేశం. టీచర్లంతా 90శాతం పైగా నిబద్ధతతో పనిచేయాలి.. విద్యార్థులకు విద్యనందించాలి. గత ఏడాదికంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు తగ్గాయి. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవమని భావించేలా పాఠశాలలను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వం వైపు నుంచి మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళలకు బాధ్యత అప్పగించాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించాం. తెలంగాణ బలపడాలి అంటే మనందరం కార్యదీక్షతో పనిచేయాలని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లో మినీ స్టేడియంల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగం పెరుగుతోంది. అందుకే ముచ్చర్లలో 50 ఎకరాల్లో రూ.150 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం. స్కిల్ యూనివర్సిటీలో యువకులకు నైపుణ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. మీరు నేర్పే విద్యనే రేపటి తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే మీ లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతాం**
**నాలాలు, భూముల కబ్జాలపై ఉక్కుపాదం**
**గంజాయి పేరు చెబితేనే వణకాలి**
**శాంతిభద్రతలపై రాజీ పడే ప్రసక్తి లేదు**
**మూసీ రివర్ ఫ్రంట్‌తో నగరానికి వన్నె**
**హైడ్రా ద్వారా సమగ్ర ప్రణాళిక అమలు**
**శాసనసభలో స్వల్పకాలిక చర్చలో సిఎం రేవంత్**

హైదరాబాద్‌లో భూములు, నాలాల అక్రమాల నివారణకే హైడ్రా తెస్తున్నామని, దీని పరిధి 2వేల కిలోమీటర్లకు విస్తరించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైడ్రాపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎస్‌వోటీ, గ్రేహౌండ్స్ తరహాలోనే తమ హయాంలో హైడ్రా తెస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌లో ఇంటి నెంబర్లు మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రపంచంతో పోటీ పడేలా చేసేందుకే సంస్కరణలు తెస్తున్నామని అన్నారు. వైఎస్ఆర్ .. ఓఆర్ఆర్ నిర్మిస్తే కొందరు దాన్ని తాకట్టు పెట్టారని, ఓఆర్ఆర్‌ను తాకట్టు పెట్టిన వారు సభ నుంచి పారిపోయారని విమర్శించారు. హైదరాబాద్‌లో సరస్సులు మాయమవుతున్నాయి. నాలాల కబ్జాలతో హైదరాబాద్ అతలాకుతలమవుతోంది. మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్‌సాగర్‌కు జలాల తరలింపునకు ప్రణాళిక సిద్ధం చేశాం. రూ.6వేల కోట్ల ప్రతిపాదనలు ప్రధాని, జలశక్తిశాఖ మంత్రికి ఇచ్చాం. గతంలో రాత్రి 11 తర్వాత విచ్చలవిడిగా గంజాయి దొరికేది. ఇప్పుడు హైదరాబాద్‌లో ఎవరికైనా గంజాయి అమ్మే దమ్ముందా? పబ్బు, ఫామ్‌హౌస్‌ల్లో డ్రగ్ రాకెట్లతో ఎవరికి సంబంధం ఉందో చర్చించే దమ్ముందా అన్నారు. గంజాయి అంటే జడుసుకునేలా చేస్తున్నామని అన్నారు. శాంతిభద్రతల విషయంలోనూ కఠినంగా

వ్యవహరిస్తున్నామని చెప్పారు. భారాస నేతలు సభలో ఉన్నప్పుడు డ్రగ్ రాకెట్లపై చర్చకు సిద్ధం. మాకు అందరి జాతకాలు తెలుసు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నందున కొన్ని అంశాలపై చర్చించట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి భిన్నాభిప్రాయాలు ఉన్నా హైదరాబాద్ అభివృద్ధికి వారిద్దరూ కృషి చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా చెప్పారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డును వైఎస్ఆర్ మణిహారంగా తీర్చిదిద్దారని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఓఆర్ఆర్ లోపల నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు హైడ్రాను సిద్ధం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. లాంగ్వేజ్, నాలెడ్జ్ వేర్వరని కేటీఆర్ తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హితవు పలికారు. అవతలి వారిని అవహేళన చేయకూడదనే అవగాహన ఆయన ఉండాలన్నారు. గత ప్రభుత్వంలో గజ్వేల్‌కు ఇచ్చిన నీరు శ్రీపాద ఎల్లంపల్లి పైప్ లైన్‌కు బొక్కపెట్టి తీసుకెళ్లినట్లు సీఎం ఆరోపించారు. దానం నాగేందర్ సభలో మాట్లాడితే తప్పేంటని, ఓ సభ్యుడికి మైక్ ఇవ్వొద్దనే అధికారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎక్కడిదని సీఎం ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ్యుల తీరును ఓపికతో చూస్తున్నామని.. కోమటిరెడ్డి, సంపత్‌ని గత సభలో ఏం చేసారో మనం చూడలేదా? అని అన్నారు. ఓ అరడజను మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేస్తే గాని వారికి బుద్ధి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కాళేశ్వరం కట్టడం, కూలడం రెండూ జరిగిపోయినట్లు రేవంత్ రెడ్డి అన్నారు. అయినా ఇంతవరకు ఎలాంటి డీపీఆర్ లేదని, కానీ మూసీ అభివృద్ధి పనులు మొదలు పెట్టకముందే కేటీఆర్ డీపీఆర్ అడుగుతున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. మూసీ కబ్జాలను త్వరలోనే

తొలగిస్తామని వెల్లడించారు. అలాగే అక్రమంగా నిర్మించిన 10,800ఇళ్లు మూసీపై ఉన్నాయని, వారందరికీ ప్రత్యామ్నాయం చూపించి భూమి కేటాయిస్తామన్నారు. హైదరాబాద్‌లో రోడ్లపై నీరు ఆగకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గుర్తించిన 141ప్రాంతాల్లో డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఉంటారని, ఆఫీసులకే పరిమితం అయిన అధికారులను ఫిజికల్ పోలిసింగ్ చేపిస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. అధికారులు రోడ్లపైకి రాకపోతే తానే వస్తానంటూ సీఎం చెప్పారు. బీఆర్ఎస్ హయాంతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రైమ్ రేటు తగ్గినట్లు సీఎం చెప్పుకొచ్చారు. అవసరాన్ని బట్టి ఒక్కో ప్రభుత్వ సంస్థను ఒక్కో సందర్భంలో తీసుకొచ్చారని, అలాగే ఇప్పుడు కాంగ్రెస్ హైడ్రాను తీసుకువస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ 300 ఏళ్ల క్రితమే అద్భుతంగా డిజైన్ చేయబడిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవాస్తవాలు ప్రచారం చేసి బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని, రాష్ట్రాన్ని బలహీనం చేయాలని చూస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. హైదరాబాద్ సిటీ విస్తరిస్తోందని కాబట్టే హైడ్రాను తీసుకొచ్చామని అన్నారు. 2వేల చ.కీ.మీ వరకు హైడ్రాను విస్తరిస్తామని తెలిపారు. హైడ్రాను 12 జోన్లుగా విభజించి.. జోన్ కు ఓ ఆఫీసర్ ను పెడతామన్నారు.గతంలో కండ్లముందే చెరువులు, నాలాలు కబ్జాకు గురైయ్యాయని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినంగా ఉంటామని సీఎం తెలియజేశారు. నాలాలు, చెరువులు కబ్జా చేయాలంటే వణుకు పుట్టేలా చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. హైదరాబాద్ విస్తరిస్తుందనే ప్రపంచ దేశాల్లో స్టడీ చేసి హైడ్రాను రూపొందించామని ముఖ్యమంత్రి అన్నారు. నిజాం, ఉస్మాన్ సాగర్ వల్లే ఈరోజు హైదరాబాద్ కు తాగునీరు అందుతున్నందని తెలిపారు. మూసీని లండన్ థేమ్స్ నదిగా సుందరీకరణ చేస్తామని తెలిపారు. మూసీ రివర్ ప్రాజెక్ట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలుస్తామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిర్మించారని.. గత ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డును రూ.7వేల కోట్లకు తాకట్టు పెట్టిందని విమర్శించారు.

# మార్పు పేరుతో...ప్రజలను ఏమార్చలేరు

### మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దమ్ముంటే అశోక్‌నగర్‌కు వచ్చి.. నువ్వు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ కరెక్ట్ అని చెప్పమని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. ఈ 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇచ్చిందని అక్కడ ఉన్న నిరుద్యోగులతో చెప్పించాలన్నారు. అలా చేస్తే మేమందరం రాజీనామా చేస్తామని సవాలు విసిరారు. రెండు లక్షల ఉద్యోగాలు బోగస్ అని కేటీఆర్ అన్నారు. ఈ విషయం మీకు కూడా తెలుసని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. మీరిచ్చిన జాబ్ క్యాలెండర్ బోగస్ అని తెలుసు.. అయినా కూడా పిల్లల్లో ఉద్వేగాల్ని రెచ్చగొట్టేవిధంగా లేని ఒక వాతావరణం నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మీ క్యాలెండర్ బోగస్.. అందులో ఉద్యోగాలే లేవు. అందులో తారీఖులు తప్ప ఏమీ లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చ పెట్టమంటే రాష్ట్ర ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు. సిగ్గులేకుండా మళ్లీ మా ఎమ్మెల్యేలను సాటి

ఎమ్మెల్యేతో ఒక బజారు భాషలో తిట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి, శాసనభకు చీకటి రోజు అని ఆయన వ్యాఖ్యానించారు. దుర్మార్గమైన పద్ధతిలో నిన్న, మొన్న మా అక్కల్ని అవమానించారని.. ఇవాళ ఒక సభ్యుడు అమ్మ, అక్క అని తిడుతుంటే శాడిస్టు మాదిరిగా ముఖ్యమంత్రి పైశాచిక ఆనందం పొందుతూ అందర్నీ ఉసిగొల్పుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తప్పకుండా తెలంగాణ యువత తప్పకుండా రేవంత్ రెడ్డికి తగు రీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు.. ఎక్కువ రోజులు డ్రామా నడవదని స్పష్టం చేశారు. ఈ ఐదారు రోజుల శాసన సభ సమావేశాల్లో ప్రభుత్వం తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. గవర్నమెంట్‌లో విషయం లేదు.. కేవలం ఊదరగొట్టే ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేవని తేలిపోయిందని కాబట్టే ఈ బజారు భాషతో మమ్మల్ని రెచ్చగొడుతున్నారని తెలిపారు. మంచిగా మాట్లాడుతుంటే కావాలనే ఉసిగొల్పి ప్రజల దృష్టి మరల్చే ఒక చీప్ ట్రాక్టిక్స్‌కు చేస్తున్నారని మండిపడ్డారు. ఈయన చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిగా పైశాచిక ఆనందం పొందుతూ.. ఆడబిడ్డలను అవమానిస్తూ.. ఎమ్మెల్యేలను బూతులు తిట్టిస్తూ ఇష్టమొచ్చినట్టు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అందుకే అసెంబ్లీలో నిరసన చెప్పి బయల్దేరి గన్‌పార్క్ వద్దకు వచ్చి.. మా



శాసన సభ్యులు, మండలి సభ్యులు అందరం వచ్చి మా నిరసన చెబుతున్నామని పేర్కొన్నారు. ఇకపోతే హైదరాబాద్ మీద కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతుందని కేటీఆర్ మండిపడ్డారు. ఆ విషయంలో కూడా తప్పకుండా ప్రభుత్వాన్ని తూర్పార పడుదామని అనుకున్నామని చెప్పారు. కానీ బజారు భాషలో మాట్లాడేసరికి మా అక్క కోవ లక్ష్మి దుఃఖం ఆపుకోలేక.. తమను బయటకు తీసుకొచ్చారని తెలిపారు. ఈ శాసనసభలో తెలంగాణ ప్రజలకు న్యాయం చేసే ముచ్చట్లు లేవని.. కేవలం కాంగ్రెస్ పార్టీ డ్రామాలు, కాంగ్రెస్ పార్టీ నాటకాలు తప్ప ఏమీ లేవని మండిపడ్డారు. అప్పులు, అప్పులు అని ఇన్ని రోజులు తప్పుడు కూతలు కూశారని చెప్పారు. అప్పులు లేవు.. ఈ రాష్ట్రం రెవెన్యూ సర్‌ప్లస్ స్టేట్ అని మేం ఎస్టాబ్లిష్ చేస్తే ఇవాళ నోరు మూసుకున్నారని తెలిపారు. అనేక విషయాలను డైవర్ట్ చేయడానికే మా అక్కల మీద నోరుపారేసుకుని.. కావాలని ప్రజల దృష్టి మరల్చే ఓ చిల్లర ప్రయత్నం చేస్తున్నాడు.. ఈ చిల్లర ముఖ్యమంత్రి అని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని గ్రహించాలని తెలంగాణ ప్రజలను విజ్ఞప్తి చేశారు. జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో చర్చించాలని అడిగితే రెండు నిమిషాలు కూడా టైమ్ ఇవ్వలేదన్నారు. నాలుగు పేపర్ల మీద ఇష్టం వచ్చింది రాసుకొచ్చి జాబ్ క్యాలెండర్ అంటున్నారని విమర్శించారు. తెలంగాణ శాసనసభ దుశ్శాసనసభగా మారిందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి కాంగ్రెస్ గెలిచింది. అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ ఇస్తామని ప్రకటనలు చేశారు.

# కేంద్ర-రాష్ట్రాల మధ్య వారధిగా గవర్నర్లు

### మొదటి పేజీ తరువాయి

అన్నారు. ముఖ్యంగా ఆదివాసీ ప్రజల ప్రయోజనాలకు గవర్నర్లు తోడ్పడాలని చెప్పారు. గవర్నర్ల సదస్సును ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.....జాతీయ లక్ష్యాలు సాధించేందుకు తోడ్పడాలని గవర్నర్లకు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర సంబంధాలను బలోపేతం చేసేందుకే కాక, సామాన్యులకు సంక్షేమ కార్యక్రమాలు చేరేందుకూ కృషి చేయాలన్నారు. క్రిమినల్ న్యాయవ్యవస్థకు సంబంధించిన కొత్త చట్టాలతో న్యాయ వ్యవస్థలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని ఆమె చెప్పారు. ప్రజాస్వామ్యం సాఫీగా పనిచేయాలంటే కేంద్ర ఏజెన్సీలు అన్ని రాష్ట్రాల్లో సమన్వయంతో పనిచేయాలని, ఇందుకు ఏ విధంగా కృషి చేయాలో రాజ్యాంగాధినేతలుగా గవర్నర్లు సూచించాలని ఆమె కోరారు. రాష్ట్రాల్లో చాన్సలర్లుగా కూడా గవర్నర్లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నందువల్ల నూతన విద్యావిధానం సూచించిన సంస్కరణలు అమలు అయ్యేలా చూడాలని సూచించారు. సహజ వ్యవసాయ విధానాలను పెంపొందించేందుకు రాజ్‌భవన్లు మార్గదర్శకం కావాలని చెప్పారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖడ్, హోంమంత్రి అమిత్‌షా కూడా రెండు రోజుల సదస్సులో తొలిరోజు ప్రసంగించారు. అభివృద్ధి పనులకు ఊతం ఇచ్చేందుకు ఆశావహ జిల్లాలు, చైతన్యవంతమైన గ్రామాలను సందర్శించాలని అమిత్ షా....గవర్నర్లను కోరారు.

# జాబ్ క్యాలెండర్ విడుదల

### మొదటి పేజీ తరువాయి

అధికారంలో ఉన్నా, నిరుద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయడంలో భాగంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు సార్లు గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దు అయిందని, ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గందరగోళంగా మార్చారని ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్ లతో రెండు కమిటీలు ఏర్పాటు చేసి, వారి సూచనల్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాత గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు చేసి, 60 కొత్త పోస్టులతో మొత్తం 563 పోస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్ 1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు 3 లక్షల మంది హాజరుకాగా, పరీక్ష సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటించామన్నారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక లక్షా 45 వేల 368 మంది హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఎగ్జామ్ కు 1 లక్షా 6 వేల 2 వందల 60 మంది హాజరుకాగా, విజయవంతగా నిర్వహించాం. 32 వేల 4 వందల 10 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేశాం. అదనంగా 13,500 ఉద్యోగ ఖాళీల భర్తీకి అనుమతులు ఇచ్చాం. 11 వేల 62 ఖాళీలతో టీచర్ రిక్రూట్ మెంట్ కోసం డీఎస్సీ ఎగ్జామ్ ప్రకటించాం. జులై 18న ప్రారంభమై ఆగస్టు 5న ముగియనున్నాయి. 465 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఖాళీల భర్తీకి, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ లో 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశాం. పరీక్షల ప్రిపరేషన్ కు తగినంత సమయం లేదని అభ్యర్థులు కోరడంతో ఆగస్టు నుంచి డిసెంబర్ కు గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా వేశాం. పరీక్షా తేదీలు ఒకటే కాకుండా, పరీక్షల మధ్య ప్రిపరేషన్ కు సమయం ఉండేలా అన్ని నియామక బోర్డులు ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాయని భట్టి విక్రమార్క ప్రకటించారు. గత ప్రభుత్వం నిర్వహించిన నియామక పరీక్షల పేపర్లు లీకయ్యాయి, పేపర్ల అమ్మకంతో పరీక్షలు రద్దయ్యాయి. పేపర్ లీక్ కారణంగా 2023 మార్చి 17న తొలిసారి గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దయింది. అభ్యర్థుల బయో మెట్రిక్ తీసుకోని కారణంగా హైకోర్టులో రెండోసారి ఎగ్జామ్ రద్దు అయింది. ప్రస్తుతం ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి, కొత్త చైర్మన్ ను నియమించి వరుసగా పోస్టుల భర్తీని పూర్తి చేశాం. పాత నోటిఫికేషన్లను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసి, ఎగ్జామ్స్ సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తున్నామని' భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ఇకపోతే షెడ్యూల్ ప్రకారం..వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ నియామకాల కోసం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల... నవంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ట్రాన్స్‌కోలోని వివిధ ఇంజినీరింగ్ ఉద్యోగాల కోసం అక్టోబర్‌లో నోటిఫికేషన్.. వచ్చే ఏడాది జనవరిలో నియామక పరీక్షలు చేపడతారు. నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహిస్తారు. వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల.. ఏప్రిల్‌లో పరీక్షలు చేపడతారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల .. ఏప్రిల్‌లో పరీక్షలు జరుగుతాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ .. మేలో పరీక్షలు చేపడతారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జులైలో నిర్వహించ నున్నారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారు. డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు వచ్చే ఏడాది జూన్‌లో నోటిఫికేషన్..సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది మేలో మరోసారి గ్రూపు2 నోటిఫికేషన్.. అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జులైలో గ్రూప్-3 నోటిఫికేషన్ నవంబర్‌లో పరీక్షలు జరుపుతారు. సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జులైలో నోటిఫికేషన్.. నవంబర్‌లో పరీక్షలు చేపడతామని ప్రకటనలో వివరించారు.

# బయటికిరా.. తోలు తీస్తా

### మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభాపతి పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. అప్పటికే భట్టి, శాసనమండలికి వెళ్లారు. డిప్యూటీ సీఎం వచ్చాక మాట్లాడే అవకాశం ఇస్తానని సభాపతి అనేకసార్లు పేర్కొన్నా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాంతించలేదు. దాదాపు 20 నిమిషాలు పాటు పోడియం వద్దే నిలిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన సాగుతుండగానే హైదరాబాద్ మెట్రో సిటీపై లఘు చర్చ మొదలైంది.

ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రె స్‌లో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రసంగిస్తున్నారు. ఆయన తన ప్రసంగం కొనసాగిస్తుండగా.. కౌశిక్ రెడ్డి ప్రచురించడానికి వీల్లేని ఓ పదం ఉపయోగించారు. దీనిపై దానం నాగేందర్.. “తోలు తీస్తా.. ఏమనుకుంటున్నార్రా మీరు?” అని హెచ్చరించారు. “బయటకు రారా.. చూసుకుందాం.. బయట తిరగనియ్యకుండా చేస్తా” అంటూ దానం కూడా ప్రచురించడానికి వీల్లేని పదం వాడారు. దీనిపై కౌశిక్ రెడ్డి.. “బయటెందుకు.. ఇక్కడే చూసుకుందాం” అంటూ మరింత రెచ్చగొట్టారు. దానం నాగేందర్ మరింత ఆగ్రహంతో తన స్థానం నుంచి కౌశిక్ రెడ్డివైపు కదిలారు. స్పీకర్ పోడియం నుంచి కౌశిక్ రెడ్డి సైతం ఆయనవైపు వచ్చారు. ఫలితంగా సభలో ఒక్కసారి గందరగోళం నెలకొంది. దానం నాగేందర్‌కు మద్దతుగా 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పక్కకు చేరారు.

సభ ఒక్కసారిగా అదుపు తప్పడంతో 25 మంది మార్షల్స్‌ను లోనికి పిలిపించారు. దానం నాగేందర్ భాషపై కేటీఆర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఇతర సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సభనుంచి వాకౌట్ చేశారు. అనంతరం సభలో దానం ప్రసంగం కొనసాగిస్తుండగా.. అప్పుడే సభలోకి హాజరైన మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. సభా మర్యాదను కాపాడాల్సిన సభ్యులు ఇలాంటి పదజాలం వాడటం సరికాదంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభకు క్షమాపణ చెప్పాలని కోరారు. దీనికి దానం స్పందిస్తూ.. ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాయని, సభా మర్యాద గురించి తనకు తెలుసని, అయినా తన మాటలు ఎవరికైనా బాధకలిగిస్తే క్షమాపణ కోరుతున్నానని అన్నారు.

# శ్రీశైలం పదిగేట్లు ఎత్తివేత.. సాగర్‌కు నీటి విడుదల

**శ్రీశైలం వద్ద నీటిలో గల్లంతయిన వ్యక్తి**

నంద్యాల,ఆగస్ట్2 : శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో జలాశయం 10 గేట్లను 18 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జునసాగర్‌కు వరదనీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం ఇన్ ఫ్లో : 4,65,261 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో : 4,91,602 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం : 883.80 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం : 208.7210 టీఎంసీలకు చేరుకుంది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. శ్రీశైలం డ్యాం దిగువన వరదనీటలో వ్యక్తి గల్లంతు అయిన ఘటన కలకలం రేపుతోంది. శ్రీశైలం జలాశయం లింగలగట్టు పెద్ద బ్రిడ్జ్ కింద స్నానానికి దిగి వరద నీటిలో అందరూ చూస్తుండగానే నీటిలో కొట్టుకుపోయి వ్యక్తి గల్లంతు అయ్యాడు. అతను నల్లగొండ జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన చొప్పరి యాదయ్య (50)గా గుర్తించారు. శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనార్థం స్నేహితులతో కలిసి యాదయ్య వచ్చాడు. యాదయ్య కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలావుంటే ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఒకటో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకోవడం జరిగింది. గోదావరి నీటిమట్టం11.50.అడుగులకు తగ్గింది. 175 గేట్లను అధికారులు పూర్తిగా ఎత్తివేసి 9.52 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. 14 రోజుల తర్వాత లంక గ్రామాలకు వరద ప్రవాహం తగ్గింది. పునరావాస కేంద్రాల నుంచి వరద బాధితులు ఇళ్లకు చేరుకుంటున్నారు. వరద ప్రవాహంలో మునిగిపోయి ఉద్యాన, కాయగూరలు పంటలు కుళ్లిపోయాయి. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను అధికారులు ప్రభుత్వానికి పంపారు. ÷రిళిలవరం ప్రాజెక్టు వద్ద ప్రస్తుత గోదావరి నీటిమట్టం స్పిల్ వే ఎగువన 32. 205 మీటర్లుగా ఉంది. స్పిల్ వే దిగువన 23.950 మీటర్లు నీటిమట్టం నమోదు అయ్యింది. 48 రేడియల్ గేట్ల ద్వారా 9,00,372 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ఏలూరు జిల్లా.. తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్ ఎ÷-లో 515 క్యూసెక్కులు కాగా... అవుట్ ఎ÷-లో 1048 క్యూసెక్కులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటిమట్టం: 355 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం: 349.62 అడుగులకు చేరుకుంది. ప్రస్తుత నీటి నిల్వ:. 2.030 టీఎంసీలు కాగా.. పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం: 3 టీఎంసీలకు చేరుకుంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 3 ఆగస్టు 2024




# ట్రస్మా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులుగా జి వి రమేష్

## ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూధన్



హైదరాబాద్, రోమింగ్ న్యూస్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ట్రస్మా ఎన్నికలను ఎస్.వీ.ఎం హెూటల్ లో జరిగిన జనరల్ బాడీ మీటింగ్ లో రాష్ట్ర నాయకుల ఆధ్వర్యలో నిర్వహించడం జరిగినది.
ట్రస్మా ఎలక్షన్ కమిటీ నియమించిన హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎలక్షన్ ఆఫీసర్ సతీష్ కుమార్ మరియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పల్లె వినయ్ కుమార్ ఆద్వర్యం లో జరిగిన ఎన్నికల్లో లిమేడ్చల్ మల్కాజిగిరి నూతన అధ్యక్షులు గా జి వి రమేష్ ( ముద్ర స్కూల్) , ప్రధాన కార్యదర్శి గా సి హెచ్ నిర్మలా రెడ్డి ( విజ్ఞాన్ స్కూల్), కోశాధికారి గా ఎస్ రమేష్ ( శ్రీ చైతన్య స్కూల్) లు ఎన్నికయ్యారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మధుసూధన్, ప్రధాన కార్యదర్శి ఎన్ రమేష్ రావు కోశాధికారి పి రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ... నూతనంగా నియమించ బడ్డ జిల్లా పి ఎస్ టి లు సమన్వయం తో అందర్నీ కలుపుకొని, ముందుకు సాగుతూ, ట్రస్మా అభివృద్ధి కి పాటు పడాలని,బడ్జెట్ ప్రైవేట్ పాటశాలల సమస్య ల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ రావు గారు మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి ట్రస్మా సభ్యులు నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, మరియు కోశాధికారి కి తమ పూర్తి సహాయ సహకారాలు అందించాలి అని కోరారు....లి కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి గారు మాట్లాడుతూ ట్రస్మా రాష్ట్ర కమిటీ నూతనంగా ఎన్నుకోబడిన వారికి పూర్తి సహాయ సహకారాలు అందించి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా కృషి చేయాలి అని జిల్లాలో ట్రస్మా ను మరింత బలోపేతం చేయాలి అని ఆకాంక్షించారు.... తదనంతరం ట్రస్మా నియమించిన రాష్ట్ర ఎలక్షన్ కమిటీ ద్వారా నూతనంగా ఎన్నుకోబడిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పి ఎస్ టి లకు నియామక పత్రాలు అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి, బోళ్ల శ్రీకాంత్, సిద్దాల బీరప్ప,ఎం ఐ గుల్షాని, మల్లెల శ్రీనివాస్ రెడ్డి , చల్లా నాగార్జున రెడ్డి సతీష్ కుమార్, రాధా కృష్ణ , భీమ్ రెడ్డి, బాబు రావు గారు, శ్రీనివాస్ వెంకన్న శ్రీకాంత్, శ్యామ్,నరేష్ రెడ్డి ,మరియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ట్రస్మా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





## పదవి విరమణ సన్మాన కార్యక్రమం



శ్రీశైలం , ఆగస్టు 2 ( రోమింగ్ న్యూస్ ) కర్నూలు జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ నందు 32 సంవత్సరములు ఎలాంటి రీమార్క్ లేకుండా పనిచేసిన ఏ భాస్కర్ బాబు జూనియర్ అసిస్టెంట్ కు 31/ 7 /2024 పదవి విరమణ సందర్భంగా శ్రీశైల దేవస్థానం రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ మల్లికార్జున, రిటైర్డ్ పర్యవేక్షకులు సూర్యనారాయణ రెడ్డి, వెంకట రాముడు, వెంకటేశ్వర్లు, ఎం. బిమ్లా నాయక్, వారు శ్రీ స్వామి అమ్మవార్ల శాలువ, ప్రసాదములు ఇచ్చి ఘనంగా సన్మానించడం అయినది. మరియు కర్నూలు జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్నెంట్ ప్రభాకర్ రెడ్డి, ఏడి రమేష్ మరియు హాస్పటల్ సిబ్బంది ఘనంగా సన్మానించడం అయినది.

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల హుండీల లెక్కింపు



శ్రీశైలం, ఆగస్టు 2 ( రోమింగ్ న్యూస్ ) : ఈ రోజు (02.08.2024)న జరిగిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ.3,31,70,665/–లు నగదు రాబడిగా లభించింది.ఆలయ హుండీల రాబడిని భక్తులు గత 29 రోజులలో ( 04.07.2024 నుండి 01.08.2024 వరకు) సమర్పించడం జరిగింది.
అలాగే ఈ హుండీలో 127 గ్రాముల బంగారం, 4 కేజీల 400 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 489 యుఎస్ఏ డాలర్లు, 4445 యూ.ఏ.ఈ దిర్హమ్స్. 5,00,000 వియత్నాం డాంగ్స్, 90 థాయిలాండ్ భట్స్, 108 కత్తార్ రియాల్స్, 1– మలేషియా రింగిట్స్, 15 %–% సౌదీ ఆరేబియా రియాల్స్, 20– ఇంగ్లాండు పౌండ్స్, 2 సింగపూర్ డాలర్లు, 5 %–% యూరోలు మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీల లెక్కింపులో లభించాయి.పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ డి.పెద్దిరాజు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి రవణమ్మ, పలువురు శాఖాధిపతులు, ఆయా విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జిగా నల్ల వేణు నియామకం...



భువనగిరి,ఆగస్టు2(రోమింగ్ న్యూస్) : సికింద్రాబాద్ పద్మారావు నగర్ ఎంఆర్పిఎస్ ఆఫీసులో జాతీయ అధ్యక్షుడు బి ఎం. రమేష్ ఆధ్వర్యంలో నల్ల వేణుని యాదాద్రి భువనగిరి జిల్లా ఎమ్మార్పీఎస్సీ ఇన్చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా నల్ల వేణు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జిగా బాధ్యతలు ఇచ్చిన బి.ఆర్ రమేష్ కి, కమిటి సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మార్పీఎస్ అభివృద్ధికి కార్యాచరణకు ఎల్లవేళల నా వంతు కృషిచేసి పడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బి ఎం రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాల సాయి, ఎంఆర్పిఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీశైల దేవస్థానం నందు మద్యం సేవించి డ్యూటీలు చేస్తున్న సెక్యూరిటీలను తొలగించాలి

### మాయలూరు వెంకటేశ్వర్లు



శ్రీశైలం, ఆగస్ట్ 2 (రోమింగ్ న్యూస్ ) : శ్రీశైలం దేవస్థానం లో నిన్న రాత్రి సెక్యూరిటీ విభాగంలో కార్తికేయ ఏజెన్సీ ద్వారా విధులు నిర్వహిస్తున్న భక్తుల క్యూలైన్ నందు మద్యం సేవించి భక్తుల పట్ల అమర్యాద గా ఉండడమే కాకుండా విధుల పట్ల భక్తుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పైన చర్యలు తీసుకోని అదేవిదంగా వైసీపీ పాలన లో ఇష్టనుసారంగా అక్రమంగా టెండర్లు తీసుకోని దేవస్థానం ప్రతిష్టకు భంగం కలిగే విదంగా వ్యవహరించడానికి కారణం అయినా ఏజెన్సీ వారిమీద శ్రీశైలం దేవస్థానం అధికారులు తక్షణమే చర్యలు తీసుకొనవలసినదిగా, అదేవిదంగా గతం లో%ఖాజ% పెట్రోల్ బంక్ నందు 45 లక్షలు రూపాయలు అవినీతి జరిగిన ఏజెన్సీ శ్రీశైలేశ్వర ఏజెన్సీ పైన ఇంతవరకు చర్యలు తీసుకొనలేదు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం వారికి తప్పుడు సమాచారం దేవస్థానం అధికారులు ఇచ్చి కేవలం శ్రీశైలేశ్వర ఏజెన్సీ వారికి నోటీసు ఇచ్చాము, అని తెలి పియున్నారు. ఇన్ని సంవత్సరాలనుండి చర్యలు తీసుకొనకుండా వైసీపీ వారికి సహకరిస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతినె విదంగా శ్రీశైలం దేవస్థానం లో ఇలాంటి సంఘటన లకు కారకులు అవుతున్నారు. కార్తికేయ. శ్రీశైలేశ్వర ఏజెన్సీ వారిపైన తక్షణమే చర్యలు తీసుకోవాలని శ్రీశైలం మండలం బీజేపీ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాము.

## వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి : జిల్లా కలెక్టర్



భువనగిరి ,ఆగస్టు2(రోమింగ్ న్యూస్) వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే బ్యాంక్ ప్రతినిధులకు సూచించారు.
శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశం మందిరంలో జరిగిన బ్యాంక్ కన్సల్టేటివ్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైనారు. 2024– 25 సంవత్సరానికి సంబంధించి 5279 కోట్ల 34 లక్షలతో జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత రంగానికి అత్యధికంగా 4513 కోట్ల 9 లక్షలు, ప్రాధాన్యేతర రంగానికి 766 కోట్ల 25 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రాధాన్యతా రంగానికి సంబంధించిన వాటిలో వ్యవసాయ రంగానికి 3636 కోట్ల 27 లక్షలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార రంగాలకు 762 కోట్ల 29 లక్షలు, విద్యారంగానికి 17 కోట్ల 55 లక్షలు, గృహ రుణాల కింద 70 కోట్ల 20 లక్షలు, సామాజిక మౌలిక సదుపాయాల కోసం 11 కోట్ల 76 లక్షలు, పునరుత్పాదక శక్తి కింద 15 కోట్ల 2 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లా వార్షిక ప్రణాళికలో అత్యధిక భాగం వ్యవసాయ రంగానికి కేటాయించడం జరిగిందని తెలిపారు. బ్యాంకర్లు అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందించి ఆదుకోవాలని, అలాగే రైతులు కూడా తమ పంట రుణాలను రెన్యువల్ చేయించుకుని పంట సాగుబడి పెట్టుబడికి తిరిగి రుణం పొందాలని సూచించారు. పి.ఎం.ఇ.జి.పి., పి.ఎం.ఎఫ్.ఎం.ఇ. ఋణాలు లబ్దిదారులకు సకాలంలో అందించాలని సూచించారు. పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి లబ్దిదారులకు కిసాన్ క్రెడిట్ ఋణాలు సకాలంలో ఇవ్వాలని తెలిపారు. బ్యాంకులలో రుణ దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ మేనేజర్ శివరామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా పరిశ్రమల అధికారి రవీందర్, ఆర్బిఐ ఏజీఎం గోమతి, నాబార్డ్ డీడీఎం సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి యాదయ్య, వివిధ బ్యాంకర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



భువనగిరి,ఆగస్టు2(రోమింగ్ న్యూస్) : ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని హర్షిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సి విభాగం అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద సి ఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు ,మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, పీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్ లు మాట్లాడారు. సామాజిక న్యాయం లో భాగంగా ఎస్సీ రిజర్వేషన్లను ఏబిసిడిలుగా వర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారని అన్నారు. ఆనాటి సోనియా గాంధీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం మన్మోహన్ సింగ్ ప్రధానిగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చొరవతో అప్పటి పార్లమెంట్ స్పీకర్ మీరా కుమార్ సహకారంతో ఉష మెహర కమిషన్ ఏర్పాటు చేయడంతో దేశవ్యాప్తంగా కమిషన్ పర్యటించి క్షేత్ర స్థాయి నుంచి ఎస్సీ రిజర్వేషన్ల అమలు తీరును పరిశీలించి గణాంకాలు వివరాలు తీసుకొని విద్యా ఉద్యోగ రాజకీయ సామాజిక అన్ని రంగాలలో మాదిగలు మాదిగ ఉపకులాలు తీవ్రంగా నష్టపోతున్నాయని 70 శాతం జనాభా ఉ ండి కూడా 10 శాతం రిజర్వేషన్ మాత్రమే అనుభవిస్తున్నారని కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగానే సుప్రీంకోర్టు నిన్న చారిత్రాత్మకమైన తీర్పు వెలువరించిందన్నారు. తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రాష్ట్రాల కన్నా ముందే ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించడం అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ రిజర్వేషన్లు అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని నిండు సభలో చెప్పడాన్ని హర్షిస్తున్నామని ఈ అంశంలో తమ వంతు పాత్ర పోషించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా గారి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులకు బృందానికి న్యాయవిభాగానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూర వెంకటేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగారం శంకర్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్ ,కౌన్సిలర్ ఈరపాక నర్సింహా, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎర్ర శ్రీరాములు, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కొండపురం గణేష్, జిల్లా కార్యదర్శి దేవరకొండ మహేష్, పోలిశెట్టి అనిల్, పల్లెర్ల యాదగిరి, గ్యాస్ చిన్న, సాల్వేరు ఉపేందర్, మాదాసు గోవర్ధన్, బొల్లెపల్లి అశోక్ పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల సాధనకై కృషి :యాదాద్రి భువనగిరి ప్రెస్ సొసైటీ



భువనగిరి,ఆగస్టు2(రోమింగ్ న్యూస్) జర్నలిస్టుల హక్కులు, సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని యాదాద్రి భువనగిరి ప్రెస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గంధమల్ల రాజు, ఉపాధ్యక్షులు గడ్డమీది చంద్రం అన్నారు. యాదాద్రి భువనగిరి ప్రెస్ క్లబ్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ చౌరస్తా కేక్ కట్ చేసి జర్నలిస్టు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులు ఐక్యం గా ఉండి ప్రెస్ క్లబ్ భవనం ఏర్పాటు చేసుకోవాలని వారు పేర్కొన్నారు. సొసైటీ తరపున ఆపదలో ఉన్న జర్నలిస్టులను సహాయ సహకారాలు అందజేశామఅని, భవిష్యత్ లో అండగా ఉంటామని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వచ్చే విధానంగా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గడసందుల నాగరాజు, కోశాధికారి అరె కుమార్, కమిటీ సభ్యులు బాబు, కురెళ్ల మల్లేశం, ఉదయ్ రెడ్డి, లక్ష్మీ నారాయణ, కిషన్, మహేష్, బాలకృష్ణ, చరణ్, బలరాం రెడ్డి,ఫణిదర్, సురేష్, రహమాన్, ఫిరోజ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల సౌకర్యార్థం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం : జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే



భువనగిరి,ఆగస్టు2(రోమింగ్ న్యూస్) : ప్రజల సౌకర్యార్థం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సముదాయంలో ప్రజాపాల కేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మున్సిపల్ పట్టణాలతో పాటు, అన్ని మండల కేంద్రాలలోని ఎంపీడీఓ కార్యాలయాలలో ప్రజా పాలన సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, అయితే వివిధ పనుల నిమిత్తం, సమస్యలు విన్నవిస్తూ అర్జీలు సమర్పించేందుకు అనునిత్యం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సైతం ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులో ఉండాలని భావించి దీనిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల లోని వంట గ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, తదితర పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పలు కారణాల వల్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందలేకపోతున్న అర్హులైన దరఖాస్తుదారులు, ప్రజాపాలన సేవా కేంద్రాలను సందర్శించి ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిచేయించుకోవచ్చని సూచించారు. కలెక్టరేట్లో అందుబాటులోకి తెచ్చిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డేటా సవరణ కోసం వచ్చే దరఖాస్తుదారులు తమ వెంట రేషన్ కార్డ్, ఆధార్ కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్, ఎల్.పీ.జీ కస్టమర్ ఐడి, మొబైల్ నెంబర్ వంటివి తమ వెంట తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి జి.వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంసుందర్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 3 ఆగస్టు 2024





# నిసా జీవితకాల సభ్యునిగా కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి



దిల్సుఖ్ నగర్, రోమింగ్ న్యూస్: ఓక్ వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్, మరియు లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్ జీవితకాల సభ్యులయ్యారు. నిసా అధ్యక్షులు డాక్టర్ కుల్భూషణ్ శర్మ లైఫ్ టైం మెంబర్షిప్ ను ఇస్తూ సర్టిఫికెట్ ను, ధ్రువీకరణ పత్రాన్ని కొమటి రెడ్డి గోపాల్ రెడ్డికి పంపించారు. కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి యొక్క కమిట్మెంట్ నిసాకు ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన సేవలు ప్రశంసనీయమని గోపాల్ రెడ్డి ని జీవితకాల సభ్యులుగా తీసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు.
ఈ సందర్భంగా పలువురు ట్రస్మా కరస్పాండెంట్లు గోపాల్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

## 25 శాతం మేర పెరిగిన రెవెన్యూ రాబడులు

### రాష్ట్ర స్థితిగతులపై కాగ్ నివేదిక విడుదల

హైదరాబాద్,ఆగస్ట్ 2 : తెలంగాణ శాసనసభలో 2023 మార్చితో ముగిసిన ఏడాదికి రాష్ట్ర స్థితిగతులపై కాగ్ నివేదిక విడుదల చేసింది. రాష్ట్ర జీఎస్డీపీ 2021-22తో పోలిస్తే 2022-23లో 16 శాతం పెరిగిందని అందులో పేర్కొంది. రెవెన్యూ రాబడులు గణనీయంగా 25 శాతం మేర పెరిగాయి. రెవెన్యూ రాబడుల వృద్ధి రేటు ఒక శాతం తగ్గింది. సొంత పన్నుల రాబడి గణనీయంగా 17 శాతం పెరిగింది. సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.2,06,977 కోట్లకు పెరిగింది. 2023 మార్చి నాటికి పూర్తి కావాల్సిన 20 ప్రాజెక్టుల అంచనా వ్యయం పెరిగింది. రూ.2,749 కోట్ల మేర ద్రవ్యలోటు తక్కువ చేసి చూపించారు. 2022-23లో ప్రభుత్వం ఇచ్చిన రుణాలు, అడ్వాన్స్‌లు 150 శాతం మేర పెరిగాయి. సొంత రాబడి లేని సంస్థలకు ప్రభుత్వం రుణాలు ఏర్పాటు చేసింది. 2022-23 బ్జడెట్ వెలుపలి రుణాలు రూ.1,18,629 కోట్లుగా అంచనా. ఆయా రుణాలకు ప్రభుత్వం తదుపరి రుణాలుగా రూ.17,829 కోట్లు అందించింది. రాష్టాభివృద్ధి రుణాలపై వడ్డీపై ఖర్చు తక్కువగా అంచనా వేస్తున్నారు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లను భారీగా అంచనా వేస్తున్నారు. ఏపీ నుంచి తెలంగాణ విద్యుత్ కంపెనీలకు బకాయిలు రాలేదు. ఇళ్లు, గొర్రెల పంపిణీ, ఆయిల్‌పామ్ పథకాల నిధులు ఖర్చు కాలేదు. దళితబంధు, రుణమాఫీ పథకాలకు కేటాయింపుల్లో భారీగా ఖర్చు కాలేదు' అని కాగ్ తన నివేదికలో పేర్కొంది.

## కొందరి సభ్యత్వాలు కాదు.. మీ సభ్యత్వం చూసుకోండి

### సిఎం రేవంత్ వ్యాఖ్యలపై కౌశిక్ రెడ్డి కామెంట్స్

హైదరాబాద్,ఆగస్ట్ 2 : కొందరు ఎమ్మెల్యేల సభ్యత్వాల రద్దు అవుతాయంటూ సిఎం చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఘాటుగా స్పందించారు. రద్దు సంగతి తరవాత...
సీఎం రేవంత్ అమెరికా వెళ్లి వచ్చే వరకు ఆయన సభ్యత్వం ఉంటుందో లేదో చూసుకోవాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చురకలంటించారు. ఖమ్మం, నల్లగొండ మంత్రులు ఆయన సభ్యత్వం రద్దు చేసేలా ఉన్నారంటూ సెటైర్లు వేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి బెదిరిస్తే ఇక్కడ భయపడే వాళ్లు ఎవరూ లేరన్నారు. అసెంబ్లీలో మైక్ ఇవ్వడం లేదని ఆరోపించారు. సబితా ఇంద్రారెడ్డిని అవమానించినందుకు సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు అవుతుందో లేదో కానీ.. అమెరికా వెళ్లి వచ్చేవరకు మీ సభ్యత్వం ఉంటుందో లేదో చూసుకోవాలంటూ రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. హుజురాబాద్ ప్రజలకు రెండో విడత దళిత బంధు నిధులు విడుదల చేయాలన్నారు. హుజురాబాద్‌లో అగ్నిప్రమాదం జరిగితే ప్రభుత్వం స్పందించలేదన్నారు. తన జీతం నుంచి బాధితులకు రూ.4 లక్షలు ఇచ్చానని చెప్పారు. హుజురాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మిత్రుడు మీడియా వాళ్లను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.

## అగ్రికల్చర వర్సిటీలో హైకోర్టు వద్దు

### మరోచోట స్థలం కేటాయించాలి

### అసెంబ్లీలో కెటిఆర్ డిమాండ్

హైదరాబాద్,ఆగస్ట్ 2 : రాష్ట్రానికి సంబంధించి హైకోర్టు భవనం ఆధునికంగా కడుతామన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.. కానీ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయం స్థలంలో కాకుండా మరో చోట కట్టాలని కోరుతున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. ఇందుకోసం మరోచోట స్థలం కేటాయించాలన్నారు. శాసనసభలో సివిల్ కోర్టుల సవరణ బిల్లును శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వ్యవసాయ భూముల్లో హైకోర్టు భవనం నిర్మించొద్దని యూనివర్సిటీ విద్యార్థులు నెల రోజుల పాటు ఆందోళన చేశారు. వ్యవసాయ విద్యాలయంలో పరిశోధనలతో ఫీల్డ్ ఎక్సపరిమెంట్ పరిశోధనలు జరగాలి. ఆ పరిశోధనలకు భూమి అవసరం. రాష్ట్ర రైతంగానికి ఉపయోగపడే విధంగా కొత్త వంగడాలు తీసుకురావాలి. కాబట్టి వ్యవసాయ పరిశోధనలు జరగాల్సిన యూనివర్సిటి భూములను తీసుకోవద్దని కోరుతున్నట్లు వెల్లడించారు. అగ్రికల్చర్ వర్సిటీకి చెందిన 100 ఎకరాలు తీసుకుంటామన్న ఆలోచన విరమించుకోవాలి. అక్కడ ప్రొఫెసర్లు, విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. మరో ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.
కేంద్ర చట్టాల విషయంలో కర్ణాటక, పశ్చిమ బెంగాల్, తమిళనాడు సీఎంలు ముగ్గురు కూడా తమ తమ రాష్ట్రాల్లో సవరణలు తీసుకోస్తామన్నారు. ఈ చట్టాల ప్రకారం ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం కూడా నేరం. గతంలో మీ పార్టీ వారు చాలా సార్లు చేశారు. కాబట్టి ఇబ్బందులు జరుగుతాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల తరపున ప్రతిపక్షాలు నిరసనలు చేయడం పరిపాటి. కాబట్టి మీరు సవరణలు తీసుకోస్తారో లేదో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం వారు సభ పెట్టుకుంటామంటే పోలీసులు అనుమతి ఇవ్వడం లేదు. ఏ చట్టం ఉపయోగించి నిరాకరించరో తెలియడం లేదు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే డిలీట్ చేయమని ఒత్తిళ్లు వస్తున్నాయి. అనధికారిక ఒత్తిడి, బలప్రయోగం చేయడం సరికాదు. దీన్ని కూడా ప్రభుత్వం ఆలోచించాలి. చట్టాలను దుర్వినియోగం చేసే పరిస్థితి రాకూడదన్నారు కేటీఆర్.

## నీట్‌లో విస్తృతస్థాయి లోపాలు జరగలేదు

### లీక్ కేవలం బీహార్, జార్ఖండ్‌లకే పరిమితం

### పరీక్షను రద్దు చేయాల్సిన అసవరం లేదు

### మరోమారు కీలక వ్యాక్యలు చేసిన సుప్రీం

న్యూఢిల్లీ,ఆగస్ట్ 2 : నీట్ యూజీ 2024 పరీక్ష ప్రశ్నపత్నం లీకేజీ వ్యవహారంలో సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరీక్షను రద్దు చేయాల్సిన అవసరం లేదంటూ ఇటీవల కీలక తీర్పునిచ్చిన ధర్మాసనం.. అందుకుగల కారణాలను వివరిస్తూ శుక్రవారం మళ్లీ తీర్పు వెలువరించింది. ఈసందర్భంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ లోపాలను ధర్మాసనం ఎత్తిచూపింది. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది. నీట్ పేపర్ లీకేజీలో ఎలాంటి వ్యవస్థీకృత ఉల్లంఘనలు చోటుచేసుకోలేదు. పరీక్ష పవిత్రతను దెబ్బతీసేలా విస్తృత స్థాయిలో లీక్ జరగలేదు. ప్రశ్నపత్రం లీకేజీ ఝార్ఖండ్‌లోని హజారీబాగ్, బిహార్‌లోని పట్నా వరకే పరిమితమైంది. దానిపై దర్యాప్తు జరుగుతోంది. అందుకే మేం పరీక్షను రద్దు చేయాలనుకోలేదు. అయితే, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయి. విద్యార్థుల భవితకు సంబంధించిన అంశంలో ఇలాంటివి చోటుచేసుకోవడం సరికాదు. ఈ సమస్యను కేంద్రం ఈ ఏడాదే పరిష్కరించాలి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్టీయేదేనని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈసందర్భంగా ఎన్టీయే పనితీరు, పరీక్షల్లో సంస్కరణల కోసం నియమించిన ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని కమిటీకి సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్యానెల్‌ను మరింత విస్తరించాలని పేర్కొంది. పరీక్షా విధానంలో లోపాలను సరిదిద్దడానికి అవసరమైన చర్యలపై కమిటీ సెప్టెంబరు 30లోగా తమ నివేదికను అందజేయాలని ఆదేశించింది. పరీక్షా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అంతర్జాతీయ సాంకేతిక సంస్థల సాయం తీసుకోవాలని సూచించింది. ఈ నివేదిక అందిన తర్వాత అందులోని అంశాలను అమలుచేసే అంశంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని
కేంద్రం, విద్యాశాఖను ధర్మాసనం ఆదేశించింది. ఈ ఏడాది నీట్ ప్రవేశపరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు.

## త్వరలో సమగ్ర క్రీడా పాలసీ

### క్రీడాకారులను ప్రోత్సహించేలా చర్యలు

### స్కిల్ వర్సిటీ వద్దే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

### బిసిసి ఆధ్వర్యంలో నిర్మించేలా భూ కేటాయింపులు

### ఉన్న స్టేడియాలను కూడా ఉపయోగించుకుంటాం

### నిఖత్ జరీన్, సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు

### బడ్జెట్‌లో స్పోర్ట్స్ కోసం రూ. 361 కోట్లు కేటాయించాం

### అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన



హైదరాబాద్,ఆగస్ట్ 2 : తెలంగాణలో సమగ్ర స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పిల్లలను క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. మాదక ద్రవ్యాలకు వారిని దూరం చేసేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. కందుకూరు మండల పరిధిలోని బేగరికంచలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పిల్లలను పుస్తకాలకు పరిమితం చేసి క్రీడలకు దూరం చేస్తున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.
శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి స్పోర్ట్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆలోచన చేస్తూ వివిధ సందర్భాల్లో నేను ప్రస్తావించాను. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో గచ్చిబౌలి స్టేడియంలో వివిధ రకాల క్రీడలు నిర్వహించాం. వివిధ కారణాల చేత గేమ్స్ నిర్లక్ష్యానికి గురయ్యాయి. పుల్లెల గోపీచంద్ అకాడమీకి ల్యాండ్ ఇచ్చాం. ఆ అకాడమీ నుంచి చాలా మంది క్రీడాకరులు తయారయ్యారు. ప్రయివేటు అకాడమీలు కాకుండా ప్రభుత్వం తరపున శిక్షణ ఇస్తే అద్భుతంగా రాణించడానికి అవకాశం ఉంటుంది.. అందుకే ప్రత్యేకంగా ఈ బడ్జెట్‌లో స్పోర్ట్స్ కోసం రూ. 361 కోట్లు కేటాయించాం అని రేవంత్ రెడ్డి తెలిపారు. పిల్లలను పెద్ద పెద్ద చదవులు చదివించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వారిని పుస్తకాలకే పరిమితం చేసి క్రీడలకు దూరం చేస్తున్నారు. ఆటల్లో కూడా రాణిస్తే ఉద్యోగాలు వస్తాయి.. ఉపాధి దొరుకుతుంది.. ఆ కుటుంబానికి గౌరవం కూడా లభిస్తుంది. ఈ విషయం ప్రపంచానికి తెలియజేసేందుకే నిఖత్ జరీన్‌కు, సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం. ఇండ్లు కట్టుకునేందుకు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో 600 గజాల చొప్పున స్థలం కేటాయించాం అని సీఎం పేర్కొన్నారు. చదవు కంటే కూడా క్రీడల్లో రాణిస్తే తప్పకుండా ఉద్యోగ భద్రత ఉంటుంది. ఇంటర్ పాసైన సిరాజ్‌కు విద్యార్హతలో మినహాయింపు ఇచ్చి ఉద్యోగం ఇచ్చాం. తెలంగాణ రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. వివిధ రాష్ట్రాల్లో స్టడీ చేసి సమాచారం సేకరించాం. హర్యానా రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. కాబట్టి హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను అనుసరించాలని నిర్ణయించాం. వచ్చే సమావేశాల్లో స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తాం అని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతి మండల కేంద్రంలో ఒక మినీ స్పోర్ట్స్ స్టేడియంను నిర్మిస్తాం. రాష్ట్రంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐతో మాట్లాడుతున్నాం.. ప్రాథమిక చర్యలు పూర్తయ్యాయి. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రాంతానికి న్యాక్‌ను షిఫ్ట్ చేస్తాం. బేగరికంచెలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియంను నిర్మించడానికి భూమి కేటాయిస్తాం. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐ వారు ముందుకు వచ్చారు. ఈ స్పోర్ట్స్ విషయంలో నిధుల కేటాయింపుతో పాటు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. ఈ రాష్ట్రంలో యువతను వ్యసనాల
నుంచి బయటకు తీసుకురావలంటే స్పోర్ట్స్‌ను ప్రోత్సహించాలి. స్పోర్ట్స్ పాలసీకి సంబంధించి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తాం. కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి, సరూర్ నగర్, ఎల్బీ స్టేడియంలు రాజకీయ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ప్రపంచంలో మన పిల్లలు పతకాలు సాధించే విధంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.నగరంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బేగరికంచలోని స్కిల్ యూనివర్సిటీకి సమీపంలో ఈ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనిపై బీసీసీఐతో ప్రాథమిక చర్చలు పూర్తిచేశామన్నారు.
రాష్ట్రంలో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. త్వరలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు తమ సలహాలు ఇవ్వాలని అన్నారు. వ్యసనాల నుంచి యువతను బయటకు తీసుకురావాలంటే క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే సమావేశాల్లో క్రీడలకు సంబంధించిన పాలసీ తీసుకొస్తామని.. దీనికి సంబంధించి ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దీనికి అందరూ సహకరించాలని సీఎం కోరారు.

## కొందరికే రుణమాఫీ సరికాదు

### అర్హులైన అందరికీ వర్తింప చేయాలి

### మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్

నిజామాబాద్,ఆగస్ట్ 2 : రుణమాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతున్నదని మాజీ మంత్రి,బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. తక్కువ మందికి రుణమాఫీ చేసినందుకు సంబురాలు చేసుకోవాలా అని ప్రశ్నించారు. సవాలక్ష కొర్రీలు పెట్టి కొందరికే అమలు చేయడం దారుణమని అన్నారు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది రైతులకు లబ్ది చేకూరినట్లు తెలిపారు. ఎవరెక్కువ మందికి రుణమాఫీ ప్రయోజనం కల్పించారో లెక్కలు తీస్తే తెలుస్తుందని అన్నారు. రుణమాఫీ రైతులందరికి వర్తిపం చేయాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రం మొత్తం రుణమాఫీని 37లక్షల మంది రైతులకు వర్తింపజేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు, లోన్ రీషెడ్యూల్, ఆదాయ పన్ను పేరిట కొర్రీలు పెట్టి 26లక్షల మంది రైతులను ఏరి పారేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఇప్పుడు కేవలం 11లక్షల మంది రైతులకు కుదించి రుణమాఫీ అమలు చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ సహాయం కొండంత అయితే రేవంత్ రెడ్డి సాయం పిడికెడంత మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకుంటున్న దుష్ప్రచారాన్ని రైతులు గమనించాలని సూచించారు. ఉద్యోగాలు చేసుకునే రైతు కుటుంబాలు, చిన్న వ్యాపారాలు చేసుకునే రైతులకు కూడా రుణమాఫీ అమలు చేయాలని వేముల డిమాండ్ చేశారు. లేదంటే రైతుల ఆగ్రహావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని ఆయన హెచ్చరించారు.కేసీఆర్ ప్రభుత్వంలో 2016లో మొదటిసారి లక్షలోపు రుణాలు కలిగి ఉన్న 3లక్షల 79వేల 520 మంది రైతులకు రూ.1576 కోట్లు రుణమాఫీని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చేసినట్లు తెలిపారు.2018లో రెండోసారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షలోపు రుణాలను లక్షా 95వేల 657 మంది రైతులకు రూ.942 కోట్లు రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. రెండుసార్లు కలిపి లక్షలోపు రుణాలను 5లక్షల 75వేల 177 మంది రైతులకు రూ.2,518 కోట్లు మాఫీ చేసినట్లు వివరించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కేవలం 94వేల 566 మంది రైతులకు రూ.459 కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని మండిపడ్డారు. రైతు సంక్షేమం కోసం ప్రపంచంలోనే ఏ రాజకీయ పార్టీ, ఏ రాజకీయ నాయకుడు తలపెట్టని కార్యక్రమాలను కేసీఆర్ చేసి చూపించారని తెలిపారు. 60 ఏండ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ రైతుబంధు, రైతుబీమా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వానకాలం సీజన్‌కు సంబం ధించి ఎకరానికి రూ.7500 చొప్పున రైతుభరోసా ఇవ్వా ల్సి ఉండగా రూ.11,250 కోట్లు ఎగ్గొట్టి ఆ డబ్బులతో రుణమాఫీ కింద రూ.6098 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఏదో ఘనకార్యం చేసినట్లుగా గ్లోబెల్స్ ప్రచారాన్ని కాంగ్రెస్ చేస్తుండడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఈ మోసానికి రైతులు సంబురాలు చేసుకోవాలా? అని ప్రశ్నించారు.

## వయనాడ్ విపత్తులో 300 దాటిన మృతులు

### 49మంది చిన్నారుల ఆచూకీ గల్లంతు

### వివరాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

తిరువనంతపురం,ఆగస్ట్2 : కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 300 దాటింది. ఈ క్రమంలో 49 మంది చిన్నారుల ఆచూకీ లభించలేదని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వీరు మరణించడం లేదా గల్లంతైనట్లు విద్యాశాఖ మంత్రి శివన్‌కుట్టి పేర్కొన్నారు. వరదల్లో ఓ హైస్కూల్ మొత్తం కొట్టుకుపోయిందన్న ఆయన.. అనేక భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు.
'ఇప్పటివరకు ఉన్న నివేదికల ప్రకారం.. 49 మంది చిన్నారులు మరణించడం లేదా గల్లంతయ్యారు. వెల్లరిమలలోని ఉన్నత పాఠశాల మొత్తం ధ్వంసమైంది. ముండక్కైతోపాటు పలు చోట్ల పాఠశాలలు దెబ్బతిన్నాయి. ప్రాణాలతో బయటపడిన విద్యార్థులు సర్టిఫికెట్లు, పుస్తకాలు కోల్పోయారు. వీరికి సహాయం చేసేందుకు ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి శివన్‌కుట్టి వెల్లడించారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో అనేక మంది ఆచూకీ లేకుండా పోయింది. వీరికోసం రెస్క్యూ బృందాలు ప్రతికూల వాతావరణంలోనూ తీవ్రంగా గాలిస్తున్నాయి. ఇప్పటివరకు 200లకుపైగా మృతదేహాలకు పోస్టుమార్టం చేసినట్లు సమాచారం. కాగా మరో 218 మంది ఆచూకీ గల్లంతైనట్లు వయనాడ్ జిల్లా అధికారులు వెల్లడించారు. 94 రిలీఫ్ క్యాంపుల్లో దాదాపు 10వేల మందికి పునరావాసం కల్పిస్తున్నట్లు చెప్పారు.

## ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

### తల్లుల కోసం ప్రయోగాత్మకంగా బేబీ బెర్తులు

### రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్ 2 : ప్రయాణికులకు సురక్షిత, సౌకర్యవంత ప్రయాణం అందించేందుకు రైల్వేశాఖ ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తల్లుల ప్రయాణాన్ని సౌకర్యవంతంగా మార్చేందుకు పిల్లల కోసం బేబీ బెర్తులను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విషయాన్ని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో వెల్లడించారు. ట్రైన్ కోచ్‌లలో బేబీబెర్త్‌లను అమర్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందా..? అని భాజపా ఎంపీ సమర్ సింగ్ సోలంకీ ప్రశ్నించారు. దానికి మంత్రి స్పందిస్తూ.. 'లఖ్‌నవూ మెయిల్‌లో రెండు బేబీ బెర్త్‌లను ప్రయోగాత్మకంగా తీసుకువచ్చాం. లఖ్‌నవూ మెయిల్‌లోని ఒక కోచ్‌లో రెండు దిగువ బెర్త్‌లకు వాటిని అమర్చాం. దీనిపై వచ్చిన ఫీడ్‌బ్యాక్‌లో ప్రశంసలు అందాయి. అయితే సామాన్లు పెట్టుకునే స్థలం తగ్గిపోవడం, సీట్ల మధ్య దూరం తగ్గడం వంటి సమస్యలు మా దృష్టి వచ్చాయి. ప్యాసింజర్ కోచ్‌లలో ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతుంటాయి. అది నిరంతర ప్రక్రియ' అని మంత్రి వెల్లడించారు. బేబీ బెర్తులు.. పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన చిన్నపాటి పడకలు. లోయర్ బెర్త్‌కు అటాచ్ అయి ఉంటాయి. ప్రయాణ సమయంలో తల్లులు ఈ బెర్త్‌పై తమ చిన్నారులను పడుకోబెట్టుకోవచ్చు. సాధారణంగా అయితే.. ఒకే బెర్త్‌పై తల్లీబిడ్డా సర్దుబాటు కావాల్సి ఉంటుంది. దీంతో స్థలం సరిపడక.. ఇబ్బందులు తప్పేవి కావు. ఇప్పుడు బేబీ బెర్త్ సాయంతో పిల్లల్ని తమ పక్కనే సురక్షితంగా పడుకోబెట్టొచ్చు. అవసరం లేనప్పుడు దీన్ని లోయర్ బెర్త్ కిందికి మడతపెట్టొచ్చు. శిశువును సురక్షితంగా ఉంచడానికి పట్టీలూ ఉన్నాయని గతంలో అధికారులు వెల్లడించారు.

## బయ్యారం ఉక్కు నిర్మించాల్సిందే

### సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

మహబూబాబాద్,ఆగస్ట్ 2 : బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని అన్ని వర్గాల ప్రజల నుంచి ఆందోళనలు కొనసాగుతున్నాయి. పుష్కలంగా ఖనిజ నిక్షేపాలు, అన్ని వసతులు ఉన్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఉన్న బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ కేంద్రం నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాగా, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయం విభజన చట్టంలో స్పష్టంగా ఉన్నా.. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సుముఖంగా లేమని బీజేపీ సర్కారు తేల్చి చెప్పి యువత ఆశలకు గండికొట్టిన విషయం తెలిసందే. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం చర్లపల్లి సమీపంలోని పెద్దగుట్టతో పాటు రామచంద్రాపురం, మొట్లతిమ్మాపురం అటవీ ప్రాంతంలో 60 ప్లస్ శాతం కలిగిన ఇనుప ఖనిజ నిక్షేపాలు అపారంగా ఉన్నాయి.ఇక్కడ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తే స్థానిక యువతకు ఉపాధితో పాటు ప్రభుత్వానికి లాభదాయకంగా ఉంటుందని నాటి ప్రభుత్వ పెద్దలు భావించి విభజన చట్టంలో పొందుపర్చారు. సెయిల్ ఆధ్వర్యంలో రూ.30వేల కోట్లతో ప్రభుత్వ రంగ ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని చట్టంలో పేర్కొన్నారు. దీని ప్రకారం బయ్యారంలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని సబ్బండ వర్ణాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## స్టాక్ మార్కెట్ల బేర్

### భారీగా నష్టపోయిన సూచీలు

ముంబయి,ఆగస్ట్ 2 : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల వరుస లాభాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సూచీలు శుక్రవారం భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ దాదాపు 900 పాయింట్లు నష్టపోగా.. నష్టాల దాటికి నిఫ్టీ 24,700 స్థాయికి చేరింది. అమెరికాలో వెలువడిన ఫ్యాక్టరీ డేటా ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనాన్ని సూచిస్తుండడం మదుపర్లలో భయానికి కారణమైంది. దీంతో ఆసియా పాటు మన మార్కెట్లూ నష్టపోయాయి. మదుపర్ల సంపద ఒక్క సెషన్‌లోనే దాదాపు రూ.5 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.462 లక్షల కోట్ల నుంచి రూ.457 లక్షల కోట్లకు తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 81,158.99 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,867.55) నష్టాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టంతో 80,868.91 వద్ద కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్ చివరికి 885.60 పాయింట్ల నష్టంతో 80,981.60 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 293 పాయింట్ల మేర నష్టపోయి 24,717 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.60గా ఉంది. సెన్సెక్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, ఎల్అండ్‌టీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79.62 డాలర్లు వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు తొలిసారి 2,506 డాలర్ల గరిష్ఠాల వద్ద కొనసాగుతోంది.అమెరికా నుంచి నిన్న వెలువడిన ఫ్యాక్టరీ డేటా ప్రపంచ మార్కెట్లలో ఆందోళనకు కారణమైంది. జులై నెలకు గానూ మానుఫాక్చరింగ్ పీఎంఐ 46.8గా నమోదైంది. 50 కంటే దిగువ ఉండటం అంటే తయారీ రంగంలో మందగమనాన్ని సూచిస్తోంది. ఈ క్రమంలో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై ఆందోళనల నెలకొనడంతో ప్రపంచమార్కెట్లు నెగెటివ్‌గా స్పందించాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్- హమాస్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కూడా మార్కెట్లపై ప్రభావం చూపాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 3 ఆగస్టు 2024





# సభలో సమయానికి ఇవ్వని ఎజెండా

## ఇలా అయితే చర్చించేదెలా : అక్బరుద్దీన్

హైదరాబాద్,ఆగస్ట్ 2 : శాసనసభ ఎజెండాను అర్ధరాత్రి ఇవ్వడం పట్ల ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఎజెండా ఒకటి ఇస్తున్నారు, సభలో మరొకదానిపై చర్చ నిర్వహిస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ అంశంపై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సభలో ప్రస్తావించారు. ఒక్క పొలిటికల్ పార్టీ కోరికల మీద, ఇష్టం మీద అసెంబ్లీ నడవకూడదు.. అందరిని పరిగణలోకి తీసుకోవాలి అని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ప్రభుత్వానికి సూచించారు. ప్రతి రోజు మాకు ఎజెండా ఒంటి గంటకు వస్తుంది.. మొన్న మాత్రం 1:40 గంటలకు వచ్చింది. అప్పుడు వస్తే సబ్జెక్ట్ మీద మేం ఎప్పుడు ప్రిపేర్ కావాలి. 25 ఏండ్ల నా అనుభవంలో ఇలా సభ జరగడం నేను ఎప్పుడు చూడలేదు అని అక్బరుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. శాసనసభ ఎజెండాపై అక్బరుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యానించిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సమర్థించారు. ఎజెండా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. శాసనసభ ఎజెండాపై మిత్రపక్షంగా మీరు కూడా స్పందించకపోతే ఎలా అని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ కోరారు. మీకు ఎజెండా అయిన వస్తుంది.. మాకు అది కూడా రావడం లేదంటూ అక్బరుద్దీన్ ఓవైసీతో కూనంనేని సాంబశివరావు అన్నారు.

# సాగర్ ఎడమ కాల్వ నుంచి నీటి విడుదల

## పూజలు చేసి విడుదల చేసిన మంత్రులు

నల్లగొండ,ఆగస్ట్2 : సాగు,తాగు నీటి అవసరాలకు గాను నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేశారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు నీటిని విడుదల చేసి దిగువకు వదిలారు. ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో సాగర్ వరద పోటెత్తింది. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ నాగార్జున సాగర్ జలాశయాన్ని చేరుతోంది. సాగర్ ఎడమ కాల్వకు తెలంగాణ మంత్రులు నీటిని విడుదల చేశారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు.. తాగు, సాగు అవసరాలకు నీటిని విడుదల నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాలు నాయక్, బత్తుల లక్ష్మా రెడ్డి ఉన్నారు. 500 క్యూసెక్కుల చొప్పున పెంచుకుంటూ 11 రోజుల పాటు నీటి విడుదల చేయనున్నారు. సాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుతం 3 లక్షల 34వేల 462 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 548.80 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 312.5050 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ 207.1416 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టునుంచి 30వేల 712 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు అధికారులు.

# లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చిన్నారిపై లైంగిక దాడి

### 9వ తరగతి విద్యార్థి వికృత చేష్టలు

### స్కూలు ముందు చిన్నారి బంధువుల ఆందోళన

హైదరాబాద్,ఆగస్ట్ 2 : హైదరాబాద్ నగరంలో దారుణం జరిగింది. ఉప్పల్ లోని లిటిల్ ఫ్లవర్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఓ బాలికపై లైంగిక దాడి చేశాడు ఓ బాలుడు. క్లాస్ రూంలోనే ఈ దాడి జరిగినట్లు ఆ చిన్నారి చెబుతోంది. ఈ విషయం శుక్రవారం వెలుగులోకి రావటం సంచలనంగా మారింది. విషయం తెలిసిన చిన్నారి పేరెంట్స్ స్కూల్ ఎదుట ఆందోళనకు దిగారు. స్కూల్ లో ఇంత జరుగుతుంటే టీచర్లు ఏం చేస్తున్నారంటూ చిన్నారి పేరెంట్స్, బంధువులు నిలదీస్తున్నారు. లైంగిక దాడి చేసిన బాలుడి వివరాలను స్కూల్ యాజమాన్యం రహస్యంగా ఎందుకు ఉంచుతుందని ప్రశ్నిస్తున్నారు. విషయం తెలిసిన పోలీసులు లిటిల్ ఫ్లవర్ స్కూల్ కు చేరుకుని విచారణ చేస్తున్నారు. టీచర్లతో మాట్లాడారు. బాలుడి వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. సున్నితమైన అంశం కావటంతో.. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కూల్ గేట్లను మూసివేశారు. చిన్నారిపై 9వ తరగతి విద్యార్థి లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఉప్పల్ ప్రముఖ స్కూల్ లో కలకలం రేపింది. రెండో తరగతి చిన్నారిపై 9 తరగతి విద్యార్థి అసభ్యంగా ప్రవర్తించాడు. చిన్నారితో వికృతి చేష్టలకు పాల్పడ్డాడు. దీంతో చిన్నారి తమ తల్లిదండ్రలతో విషయం చెప్పడంతో చిన్నారి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. స్కూల్ యాజమాన్యం స్పందించాలని ధర్నా చేశారు. దీంతో స్కూల్ మేనేజ్మెంట్ స్పందించి 9వ తరగతి విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించారు. స్కూల్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

# అన్నప్రసాదాల్లో నాణ్యతపై ప్రత్యేక దృష్టి

### శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత పెంచేందుకు చర్యలు

### ఆధార్ అనుసంధానంతో మోసాలకు అడ్డుకట్ట

### తితిదే ఈవో శ్యామలరావు వెల్లడి

తిరుమల,ఆగస్ట్ 2 : అన్నప్రసాదాల్లో నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించామని తితిదే ఈవో శ్యామలరావు తెలిపారు. దళారీ వ్యవస్థ నిరోధకానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జులైలో 22.33 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా శ్రీవాణి దర్శన టికెట్లను పరిమితం చేశామన్నారు. శ్రీవాణి దర్శన టికెట్లు రోజుకు వెయ్యి మాత్రమే జారీ చేస్తున్నట్లు చెప్పారు. గతంలో సర్వదర్శన టోకెన్లు నెలకు 1.07 లక్షలు జారీ చేసేవారని పేర్కొన్నారు. జులైలో 1.47 లక్షల సర్వదర్శన టోకెన్లు జారీ చేశామన్నారు. శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్ల విషయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. శ్రీవాణి దర్శన టికెట్ల జారికి శాశ్వతప్రాతిపాదికన కౌంటర్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.. అన్నప్రసాదంలో నాణ్యత పెంచేందుకు చర్యలు ప్రారంభించాం.. దళారి వ్యవస్థను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.. ఆన్ లైన్ లో ఒకే ఐడీ, మొబైల్ నెంబర్ ద్వారా టికెట్లు పొందుతున్న 40 వేల ట్రాన్సాక్షన్లు రద్దు చేశామని వెల్లడించారు.. ఆధార్ తో అనుసంధానం చేస్తే దర్శన టికెట్ల జారిలో దళారి వ్యవస్థను అరికట్టే ప్రయత్నం చేస్తున్నాం అన్నారు..ఇక, శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత పెంచేందుకు చర్యలు ప్రారంభించాం అన్నారు. లడ్డు ప్రసాదం దిట్టంలో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.. అయితే, తయారీ విధానంలోనే కొన్ని మార్పులు చేయాలన్నారు.. నాణ్యమైన లడ్డూ సేకరణపై దృష్టి పెట్టామని వెల్లడించారు. మరోవైపు.. టీటీడీలో డిప్యూటీ ఈవోలను బదిలీ చేశారు.. రిసెప్షన్ 1 డిప్యూటి ఈవోగా భాస్కర్.. రిసెప్షన్ 2 ఈవోగా హరింద్రనాథ్ ను.. కళ్యాణకట్ట డిప్యూటీ ఈవోగా వెంకటయ్య ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తిరుమలకు వచ్చే భక్తులందరికీ మెరుగైన సేవలు అందించి దివ్యానుభూతిని కల్పించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. భక్తులకు శ్రీవారి దర్శనం, వసతి, ఇతర సౌకర్యాలు మరింత మెరుగ్గా కల్పించేందుకు, అందరి సమన్వయంతో ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు.టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు చెప్పారు. తిరుమలలోని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పరిశుభ్రమైన, నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందివ్వాలని ఆదేశాలు జారీ చేశామని భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఇప్పటికే ఆహార పదార్థాల తయారీదారులు , హోటల్ సిబ్బందికి ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో శిక్షణ నిర్వహించినట్లు వివరించారు. ఈ ఏడాది అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఈవో ప్రకటించారు. బ్రహ్మోత్సవాల పనులను సెప్టెంబరు చివరినాటికి పూర్తి చేస్తామని వివరించారు. ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు జరుగనున్నాయని, ఆగస్టు 14న అంకురార్పణంతో ఉత్సవాలు ప్రారంభ మవుతాయని ఆయన తెలిపారు. శ్రీవారి ఆలయం వద్ద గల పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు ఆగస్టు 1 నుంచి పుష్కరిణిని మూసివేశామని ఈయన వెల్లడించారు. శ్రీవారి భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా పుష్కరిణి పైభాగంలో షవర్లు ఏర్పాటుచేశామన్నారు. సామాన్య భక్తులకు దర్శన సమయాన్ని పెంచేందుకుగాను జూలై 22వ తేదీ నుండి ఆఫ్ లైన్‌లో రోజుకు 1000 శ్రీవాణి దర్శనం టికెట్లను మాత్రమే జారీ చేయాలని నిర్ణయించామని శ్యామలారావు తెలిపారు. శ్రీవాణి దాతలకు తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో 900, మిగిలిన 100 టికెట్లను విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో జారీ చేస్తున్నామని వివరించారు. శ్రీవారి భక్తులకు అవసరమైన వసతి, దర్శనం, ఆర్జితసేవ టికెట్లకు సంబంధించి మోసగిస్తున్న అనేక మంది దళారులను ఎప్పటికప్పుడు కనిపెట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఈవో తెలిపారు. టీటీడీ ఐటి వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఆర్జిత సేవలు, దర్శనం, వసతి తదితర సేవల బుకింగ్‌లో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టామని అనన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈవో, అధికారులు పాల్గొన్నారు.

# ధరణి పేరుతో నాటి ప్రభుత్వం దగా

### గుంట భూమి కూడా అమ్ముకోలేని దుస్థితి

### ప్రైవేట్ కంపెనీకి ధరణి అప్పగించడంతో సమస్యలు

### విదేశీ కంపెనీ చేతిలో తెలంగాణ భూముల వివరాలు

### బిఆర్ఎస్ నిర్వాకంతో రైతులకు శాపంగా మారింది

### ధరణిని భూమాతగా మార్చడంపై పొంగులేటి వివరణ

### గతంలో అనేక సమస్యలు వచ్చాయన్న సీతక్క

### అందరితో చర్చించే ధరణిని తెచ్చామన్న పల్లా



హైదరాబాద్,ఆగస్ట్ 2 : ధరణి స్థానంలో భూమాతను తీసుకుని వస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కేబినేట్ ఆమోదంతో దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ధరణితో గుంట భూమి కూడా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో పొంగులేటి ధరణి పై మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత న్యాయం జరుగుతుందని ప్రజలు విశ్వాసంలో ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వం ధరణినీ ఐఎల్ ఎఫ్ కంపనీకి అప్పగించారని మండిపడ్డారు. కంపనీ కొన్ని కారణాలతో.. సింగపూర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగపూర్ కంపనీకి కేసీఆర్ తెలంగాణ భూములు తాకట్టు పెట్టారు అని మండిపడ్డారు. డిఫాల్ట్ కంపనీ కి ధరణి పోర్టల్ అప్పగించారని అన్నారు. బీఆర్ఎస్ చేసిన నిర్వాకం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఇద్దరు వ్యక్తులు కూర్చొని చేసిన చట్టం ధరణి అన్నారు. ఆల్ ఇన్ వన్ గా చెప్పుకున్న పెద్దాయన చేసిన నిర్వాకం ఇది అని తెలిపారు. ధరణి పేరుతో దగా చేశారన్నది నిజం అని అన్నారు. పదేళ్ల తెలంగాణ రాష్ట్రం.. ధృతరాష్ట్ర కౌగిలో ఇరుక్కుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కొండ నాలుక కి మందు వేస్తే ఉన్న నాలిక పోయినట్టుగా ధరణి ఉందని అన్నారు. 1973లో కాంగ్రెస్ ప్రభుత్వం సీలింగ్ చట్టం తీసుకొచ్చి పేదలకు భూములు పంపిణీ చేసిందన్నారు. వైఎస్ హయాంలో బీడు భూములకు పట్టాలు ఇచ్చారన్నారు. ప్రజలకు మేలు చేసిన వారి పేర్లను ప్రస్తావించడం తగదన్నారు. భూసంస్కరణలతో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని చాలా మంది చెప్పారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ లోపభూయిష్టంగా ఉంది. ప్రధానమంత్రి ఇందిరాగాంధీ భూసంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అనేక అంశాలు భూ సంస్కరణలతో ముడిపడి ఉన్నాయి. పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా భూసంస్కరణలు చేపట్టారన్నారు. ప్రపంచ చరిత్రలో నిలిచిన భూదాన ఉద్యమం ఇక్కడే పుట్టిందన్నారు. ధరణీ చట్టం మూడు తలలతో మొదలై.. 33 తలలతో అవతరించిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసిన సమయంలో ఎక్కడికి వెళ్లినా ధరణీ సమస్యల గురించే ప్రజలు ఆయనకు వివరించారన్నారు. ధరణీని బంగాళఖాతంలో వేస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పారని గుర్తు చేసారు. ధరణీతో సామాన్యులు అవస్థలు పడ్డారని పొంగులేటి తెలిపారు. ధరణీ వచ్చిన తరువాత ప్రతీ గ్రామంలో సమస్యలే ఉన్నాయన్నారు. అప్పటి సర్కార్ పెద్దలు ధరణీ పేరుతో ప్రజలకు దగా చేశారన్నది ముమ్మాటికి నిజమన్నారు. ధరణీ సమస్యలతో రైతులు రోడ్డున పడ్డారు. చెప్పులు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని గుర్తు చేసారు. సాదా బైనామాలకు నోటిఫికేషన్ ఇచ్చి ధరణీలో ఆ కాలమే పెట్టలేదని మండిపడ్డారు. 18 లక్షల ఎకరాల భూమిని పక్కకు పెట్టారని అలా ఎందుకు చేయాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. అధికారంలో రాగానే ధరణి

సమస్యలపై అధ్యయనం కోసం కమిటీనీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఇటీవల కొన్ని సిఫారసులు చేసింది. ఆ సిఫారసుల మేరకు.. ధరణి పోర్టల్ భూమాతగా మార్చి.. సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమయంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ... భూ రికార్డుల కోసం తీసుకువచ్చిన ధరణి సాఫ్ట్ వేర్ తో అసైన్డ్ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకుందని ఆరోపించారు. ధరణిలో జరిగిన తప్పుల కారణంగా అధికారులపై దాడులు జరిగాయన్నారు. రైతులు ధరణి అంటేనే భయపడుతున్నారని ఆమె అన్నారు. గ్రామాల్లోకి వెళ్తే ధరణి ఎప్పుడు మార్చుతారని రైతులు అడుగుతున్నారని సీతక్క చెప్పారు. ధరణితో మళ్లీ కొందరి చేతుల్లోకే భూమి వెళ్తోందన్నారు. ధరణి పేరుతో పేద రైతుల భూములు గుంజుకొని, వారికి అన్యాయం చేశారని మంత్రి సీతక్క అన్నారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌కు తూట్లు పొడుస్తున్నారని ఆమె అన్నారు. ధరణి ధరణిని రద్దు చేసి, దానిలోని మంచి విషయాలు ఉంటే స్వీకరిస్తామని అన్నారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ తో బీఅర్ఎస్ నేతలు వేల కోట్ల ఎకరాలు కబ్జా చేశారని వార్తలు వచ్చాయన్నారు. ఆ నేతలు ఎవరు? కాజేసిన భూమి ఎది? అనేది కాంగ్రెస్ బహిర్గతం చేయడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. మరి కాకి లెక్కలు చెప్తున్నారని ఆయన మండిపడ్డారు. భూములు ఎవరు కాజేశారనేది వెల్లడించాలని మహేశ్వర్ రెడ్డి కోరారు. ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలు రికవరీ చేశారని ఆయన అన్నారు. గతంలో ఇది 2 లక్షల కోట్ల కుంభకోణం అంటూ ఆరోపణలు చేసారని మహేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఈ పోర్టల్ ను గత ప్రభుత్వం విదేశీ కంపెనీకి అప్పగిస్తే.. ఈ ప్రభుత్వం ఎందుకు విచారణ చేయడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఫారెస్ట్ భూములు, ప్రభుత్వ భూములు తగ్గాయని అంటున్నారని, బీఆర్ఎస్ భూభకాసురులు కాజేశారా? ధరణి పోర్టల్ నిర్వహణను ఎవరికి ఇచ్చే ఆలోచన ఉంది..ధరణి పోర్టల్ పై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపిస్తారా ? జరిపిస్తే ఎప్పటిలోగా జరిపిస్తారు? అని మహేశ్వర్ రెడ్డి ప్రశ్నలు సంధించారు. హైదరాబాద్ లో వక్ఫ్ బోర్డ్ భూములు వేల ఎకరాలు కబ్జాకు గురైందని అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. చర్చలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్ పేరును నాలుగు గోడల మధ్య పెట్టలేదని.. అనేక రివ్యూలు చేసి అందరి సమక్షంలో నిర్ణయించిన పేరే ధరణి అని తెలిపారు. రెవెన్యూ చట్టాలను మార్చేందుకు నిర్వహించిన పలు సమావేశాల్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాటి సీఎం కేసీఆర్‌తో ఉన్నారు. దురదృష్టం ఏంటంటే ప్రభుత్వంలో ఇప్పుడు ఆయనకు మంత్రిగా అవకాశం వచ్చింది. మిగతా మంత్రులు తిట్టినట్టే పొంగులేటి కూడా కొన్ని అనరాని మాటలు అన్నారు. కేసీఆర్ పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను. ఎందుకంటే అవకాశం వచ్చినప్పుడు ఒదిగి ఉంటే మంచిది. కేసీఆర్ పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండిస్తున్నానని పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

ధరణి పేరు బాగాలేదని భూమత అని పెట్టుకుంటున్నారు. 2017లో ఎల్ఆర్‌యూపీ(ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్ ప్రోగ్రామ్స్) తీసుకున్నాం. 584 మండలాల్లో 10828 గ్రామాల్లో 15700 బృందాలు భూరికార్డులను పరిశీలించాయి. ఇందుకోసం 10809 రెవెన్యూ ఉద్యోగులు 24 వేల వీఆర్ఏలు, 535 సర్వేయర్లు కలిసి గ్రామాల్లో రికార్డులు పరిశీలించి సమాచారం తీసుకున్న తర్వాతనే పార్ట్-ఏ, పార్ట్-బీ అని పెట్టారు. పార్ట్-ఏలో వివాదాల్లేని 90 శాతం భూములు రికార్డు అయ్యాయి. 2017లో 100 రోజుల్లో ఈ పని చేశారు. వారికి బోనస్‌గా వేతనం ఇవ్వడం జరిగింది. ఇలాంటి చారిత్రక నిర్ణయం ఏ ముఖ్యమంత్రి కూడా తీసుకోలేదని పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. 60 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉందని సర్వేలో తేలింది. దాంట్లో 142 లక్షల ఎకరాలు పార్ట్ ఏలో నిక్షిప్తమైంది. 18 లక్షల ఎరాల భూమి రకరకాల కారణాల చేత పార్ట్-బీలో పెట్టారు. పార్ట్-బీలో మూడు రకాల సమస్యలు వచ్చాయి. అన్నదమ్ముళ్ల మధ్య పంచాయతీ, గెట్టు పంచాయితీ, కోర్టు కేసులు ఉండొచ్చు. రెండోది రెవెన్యూ సమస్యల వల్ల, మూడోది ఐటీ పోర్టల్‌లో కొన్ని సమస్యలు వచ్చాయి. ఈ సమస్యల కారణంగా 18 లక్షలు పార్ట్-బీలో పెట్టారు. ఆ ధరణి బాగాలేకపోతే మీరు ఎందుకు వినియోగిస్తున్నారు. పేరు మాత్రమే మార్చుతున్నారు. 82 లక్షల ఎకరాల భూమి ప్రభుత్వానికి సంబంధించి గ్రామ కంఠాలు, ఫారెస్టు, ఇతర ఇన్‌స్టిట్యూషన్‌లదిగా నిర్ధారించబడింది. ప్రభుత్వ భూమి అని నిర్ధారించబడిన భూమిని ప్రొహిబిటెడ్ ల్యాండ్‌లో పెట్టారు అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

# విపత్తు నిర్వహణకు పటిష్ట వ్యవస్థ అవసరం!

వయనాడ్‌లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 300మందికపైగగా మృత్యువాత పడ్డట్లు, మరో 300కు పైగా గల్లంతు అయినట్లు వార్తలు వస్తున్నాయి. నిజంగా ఇదో జాతీయ విపత్తు. దేశం యావత్తూ మృతుల కుటుబాలకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. జాతీయ విపత్తులు సంభవించి నప్పుడు తోణ సాయంతో పాటు పునరావాసం కూడా ముఖ్యం. సర్వస్వం కోల్పోయిన వారికి అండగా ఉండి వారు తిరిగి జీవనం సాగించేలా చూడాలి. ఇది జాతి బాధ్యతగా గుర్తించాలి. విపత్తుల సమయంలో సకాలంలో స్పందించేలా వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏటా దేశవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకుని విలవిల్లా డుతున్నాయి. విపత్తుల సమయంలో స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహాయాక చర్యల్లో నిమగ్నమయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ తమిళనాడు, తెలంగాణ, ఎపిల్లో ఏటా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ప్రజాజీవనం అతలాకుతలం అవుతున్నాయి. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలించడం, ప్రాణనష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. ఎన్డీఆర్ఎఫ్ దళాలు ఉన్నా దానిని మరితంగా పటిష్టం చేయాలి. దీనికి ఆర్మీ తరహా వ్యవస్థ అవసరం ఉంది. దేశంలో ఏ మూల ఎలాంటి ఉపద్రవం ముంచుకుని వచ్చినా సకాలంలో చేరుకుని సేవలు అందించే విధంగా తయారు కావాల్సి ఉంది. రైలు ప్రమాదాలు కావచ్చు.. వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో సకాలంలో సత్వరమే సేవలు అందించే వీలు కలుగుతుంది. ఇటీవలి వరదలు, రైలు ప్రమాదాలు చూశాక సుశిక్షిత సిబ్బంది అవసరముందని తెలుస్తోంది. దానికి సాంకేతికంగా సహాయ సహకారం అందించాలి. ప్రస్తుతానికి విపత్తులను ఎదుర్కోవడంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించిన మార్గాలే ఇప్పుడు శరణ్యంగా మారాయి. ఈ దుస్థితి పోవాలంటే ఓ అత్యున్నత వ్యవస్థ అవసరం అన్నది గుర్తించాలి. కేంద్రరాష్ట్రాలు ఇందుకు ముందుకు రావాలి. ఉమ్మడిగా వ్యవస్థను తయారు చేసుకోవాలి. దీనిని ఆర్మీలో భాగంగా చేస్తే మరీ మంచిది. అలాగే దీనికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపులు కూడా జరగాలి. సాధారణ ఆర్మీ ఇలాంటి సమయాల్లో అంతగా పనిచేయకపోవచ్చు. కానీ విపత్తు నిర్వహణకు కూడా ఆర్మీలాంటి దళాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మంచిది. భూకంపాలు, అగ్నిప్రమాలు, వరదలు లాంటి ప్రమాదాల సమయాల్లో తక్షణం స్పందించేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దేశంలో ఎక్కడ ఏ మూల ప్రమాదం జరిగినా సహాయక చర్యలకు దిగేలా తీర్చిదిద్దాలి. ఇలాంటి దళాలను ఏర్పాటు చేయడంతో పాటు, ఆర్థిక సంపత్తిని కూడా కట్టిబెడితే మంచిది. దీనిద్వారా విపత్తు నిర్వహణతో పాటు, నిరుద్యోగ సమస్యకూడా కొంతమేర తీరవచ్చు. ఈ దిశగా ఆలోచనలు చేసి ఆచరణకు సిద్దపడాలి. అప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా రంగంలోకి దిగేలా అవకాశం ఉంటుంది. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసర మని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విపత్తులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొందించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్దంగా ఉండేలా చూడాలి. ప్రస్తుత వ్యవస్థలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర విపత్తు, సహాయక బృందాలు ప్రశంస నీయమైన కృషిచేస్తున్నాయి. అయితే ఇందులో ప్రధాన భూమిక రాష్ట్రాలదిగానే ఉంటోంది. అలాగాకుండా ప్రకటిత పటిష్ట వ్యవస్థ ఉంటే సాయం కోసం కేంద్రంవైపు చూడాల్సిన ఆగత్యం రాదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు, చలన చిత్ర పరిశ్రమ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఉదారంగా ముందుకు వచ్చి విరాళాలందిస్తున్నారు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఇలాంటి విపత్తులు సర్వ సాధారణం గా మారిన దశలో ప్రత్యేక,శాశ్వత ఏర్పాటు అవసరాన్ని గుర్తించాలి. అసాధారణ వరదలు కావడంతో పెద్దయెత్తున ఆస్తినష్టం కలిగించాయి. ఇటీవలి వరదల్లో వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకునిపోయాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, సహాయక అథారిటీని పటిష్ట పరచినప్పటికీ ఇప్పుడు సంభవించిన విపత్తు అసాధారణమైనది. దీనిని ఎదు-ర్కోవడం అంత తేలికేమీ కాదు. అయినా, పరిస్థితి తీవ్రతకు మించిన వేగంతో ప్రభుత్వం కదిలింది. నదికి ఇరువైపులా వున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది. ఇకపోతే విపత్త బృందం ఉంటే నష్టం అంచనా కూడా వెంటనే గుర్తించ వచ్చు. అలాగే వెంటనే నష్టం అంచనాలు కూడా జరిగిపోవాలి. సహాయక చర్యలతో పాటు పునరావాస చర్యల్లో కూడా ఈ బృందాలు పాల్గొనేలా చేయాలి. ఇలా చేస్తే మంచి ఫలితాలతో పాటు సకాలంలో సాయం అందగలదు. అలాగే పునరావాసం, సహాయం కూడా విపత్తుల్లో భాగం కావాల్సి ఉంది.

# వయనాడ్ బాధితులకు చిత్రపరిశ్రమ అండ

## భారీగా విరాళాలు ప్రకటిస్తున్న నటులు

చెన్నై,ఆగస్ట్ 2 : వయనాడ్ విషాదంతో యావత్ దేశం వణికిపోతోంది. కేరళలోని వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడటంతో 300 మందికి పైగా మరణించారు. మరో 200 మందికి పైగా గాయపడ్డారు.

మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విపత్తుపై ప్రముఖులు కూడా స్పందిస్తున్నారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు లక్షల రూపాయలు విరాళంగా అందజేసి బాధితులకు సహాయం చేస్తున్నారు. వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు.. పలువురు ముందుకు వస్తున్నారు. ప్రముఖ తమిళ సినీ నటుడు సూర్య కుటుంబం వయనాడ్ బాధితుల సహాయార్థం రూ. 50 లక్షల రూపాయలను విరాళంగా అందించింది. అలాగే సూర్య భార్య జ్యోతికతో పాటు సూర్య సోదరుడు కార్తీ చేతులు కలిపారు. సూర్య, జ్యోతిక, కార్తీలను ప్రజలు అభినందిస్తున్నారు. ఈ మొత్తాన్ని సూర్య కుటుంబం సీఎం సహాయ నిధికి అందించింది. స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న వయనాడ్ బాధితుల సహాయార్థం కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల విరాళం అందించి ఉదారతను చాటుకుంది. అలాగే కోలీవుడ్ స్టార్ నటుడు విక్రమ్ కూడా 20 లక్షల రూపాయలు అందించారు.

ప్రముఖ మలయాళ సినీ నటుడు మమ్ముట్టి కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి 25 లక్షల రూపాయల విరాళం అందించారు. మమ్ముట్టి తనయుడు దుల్కర్ సల్మాన్ 15 లక్షల రూపాయలు ఇచ్చాడు. మమ్ముట్టి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా కూడా సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ట్రస్ట్ ముందుకొచ్చింది. బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, బట్టలు తదితరాలను కూడా అందజేస్తున్నారు. రూ. 25 లక్షల రూపాయలు ఇస్తానని మాలీవుడ్‌కు చెందిన ఫహద్ ఫాసిల్, అతని భార్య నజ్రియా నజీమ్ ప్రకటించారు. ఈ విపత్తులో ఇప్పటికే వేలాది మందిని రక్షించారు. మరికొంతమంది సినీ ప్రముఖులు కూడా వయినాడ్ బాధితులను ఆదుకుందుకు ముందుకు వస్తున్నారు. ఆదానీ లాంటి వారు ఇప్పటికే తమవంతు సాయం ప్రకటించారు.

# జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు

## ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీ

నిజామాబాద్,ఆగస్ట్ 2 : విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు పంజా విసురు తున్నాయి. దీంతో నిజామాబాద్ జిల్లాలోని దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో రోగుల సంఖ్య పెరుగుతున్నది. ఇదే అదనుగా ప్రైవేట్ ఆస్పత్రుల దందా కూడా మొదలయ్యింది. డెంగ్యూ, గున్యాల భయంతో ప్రజలు ప్రైవేట్ చికిత్సలకు వెళుతున్నారు. ఇదే అదనుగా పరీక్షల పేరుతో వేలల్లో గుంజేస్తున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ దవాఖానలతో పాటు ప్రైవేట్ దవాఖానలకు రోగుల తాకిడి పెరిగింది. వాతావరణ మార్పులతో పాటు నీటి నిల్వ కారణంగా దోమలు పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయి. జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఫీవర్ వార్డు ఏర్పాటు చేయగా రోగుల తాకిడి పెరిగింది. ప్రస్తుత పరిస్థితులను ప్రైవేట్ దవాఖానలు సొమ్ము చేసుకుంటున్నాయి. విచ్చలవిడిగా బిల్లులు వేస్తూ దండుకుంటున్నాయి. మరోవైపు, ప్రభుత్వ దవాఖానల్లోనే అంటే జీజీహెచ్‌లో చేయాల్సిన డెంగీ పరీక్ష ఎలిసా టెస్ట్‌లను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్‌లో చేస్తున్నారు. సాధారణ జ్వరాలను సైతం డెంగీ పేరు చెప్పి, ప్లేట్‌లెట్స్ పడిపోయాయని రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బిల్లులు వసూలు చేస్తున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 3 ఆగస్టు 2024





# సంపద సృష్టి కేంద్రంగా అమరావతి ప్రాంతం

**8352 చదరపు కిలోమీటర్ల పరిధిలో రాజధాని**

**తగ్గించిన సీఆర్డీయే పరిధిని మళ్లీ పెంచాలని నిర్ణయం**

**గతంలో ముందుకు వచ్చిన సంస్థలతో మళ్లీ చర్చ**

**అమరావతిని కనెక్ట్ చేసేలా కృష్ణా నదిపై ఆరు బ్రిడ్జిలు**

**ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేలా పలు సంస్థలకు అవకాశం**

**మొత్తం 12 అంశాలపై ప్రధానంగా చర్చ**

**సిఆర్‌డిఏ అథార్టీ పై చర్చించిన సిఎం చంద్రబాబు**



అమరావతి,ఆగస్ట్2 : గత ప్రభుత్వం తగ్గించిన సీఆర్డీయే పరిధిని మళ్లీ పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. సంపదసృష్టి కేంద్రంగా అమరావతి ప్రాంతాన్ని మార్చే వారికి భూ కేటాయింపులు జరపాలని సీఎం సూచించారు. గతంలో జరిపిన భూ కేటాయింపులపై పునఃసమీక్ష చేసి.. ఆసక్తి చూపే, పెట్టుబడులు పెట్టగలిగే సంస్థలకే అవకాశం ఇవ్వాలన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు ఎలాంటి సంస్థలను ఆహ్వానించాలి, ఎవరికి భూములు కేటాయించాలనే అంశంపై చర్చించారు. సంస్థలు తమ కార్యాలయాల ఏర్పాటుకు గడువు రెండేళ్లు పొడిగిస్తూ సమావేశంలో నిర్ణయించారు. సచివాలయంలో సీఆర్డీయే అథారిటీ 36వ సమావేశం జరిగింది. గతంలో 130 సంస్థలకు జరిగిన భూ కేటాయింపులు, వాటి ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. గతంలో ల్యాండ్ పొందిన వాళ్లు మళ్లీ ఎన్నిరోజుల్లో నిర్మాణాలు చేపట్టాలనే అంశంపై చర్చించారు. మొత్తం 12 అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది. దేశంలో టాప్ 10 కాలేజీలు, స్కూల్స్, ఆసుపత్రులు అమరావతిలో ఏర్పాటు కావాలన్నారు. 2015లో తెచ్చిన జీవో నెంబర్ 207 ప్రకారం 8352 చదరపు కిలోమీటర్ల పరిధిలో రాజధాని ఉంటుందని సీఎం వివరించారు. గతంలో గుర్తించిన విస్తీర్ణమే సీఆర్డీయే పరిధి అని సీఎం స్పష్టం చేశారు. మంగళగిరి మున్సిపాలిటీలో కలిపిన గ్రామాలను మళ్లీ వెనక్కి తేవాలని అధికారులకు సూచించారు. కుట్రపూరితంగా తెచ్చిన ఆర్ -5 జోన్ పైనా సమావేశంలో చర్చించారు. గత ప్రభుత్వం చట్టవ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలపై లోతైన సమీక్ష జరుపుతున్నామని అధికారులు సీఎంకి వివరించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, నాలుగు లేన్లుగా కరకట్ట నిర్మాణంపై ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఆర్డీయే కోసం 32 కన్‌స్టలెంట్లను తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పురపాలకశాఖ మంత్రి నారాయణ, సీఆర్డీయే కమిషనర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ..హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టును తిరిగి ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. సీఆర్డీయేలో కొత్తగా 778 మంది ఉద్యోగులను నియమించుకుంటామన్నారు. సీఆర్డీయే కోసం 32 మంది కన్‌స్టలెంట్లను తీసుకోవడానికి అథారిటీ నిర్ణయించిందన్నారు. సీడ్ క్యాపిటల్ నిర్మాణం విషయంలో సింగపూర్ ప్రభుత్వంతో ఉన్న ఒప్పందాన్ని గత ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు. ఈ విషయంలో తిరిగి సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలని నిర్ణయించామన్నారు. క్యాపిటల్ సిటీ ఎంత వరకు ఉంటే అంత వరకు కరకట్ట రోడ్డు నిర్మాణం ఉంటుందన్నారు. అమరావతిలోని ఈ-5, 11, 13, 15 రోడ్లను ఎన్‌హెచ్‌కు కలిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమరావతికి ఈఆర్ఆర్, ఓఆర్ఆర్‌లు ఉంటాయన్నారు. అమరావతిని కనెక్ట్ చేసేలా కృష్ణా నదిపై ఆరు బ్రిడ్జిలు వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. ఐకానిక్ బ్రిడ్జిల నిర్మాణమే చేపట్టనున్నట్టు తెలిపారు. ఆర్-5 జోన్ అంశం ప్రస్తుతం కోర్టులో ఉందన్నారు. న్యాయ పరిశీలన అనంతరం దానిపై తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు. స్టార్టప్ ఏరియాపై సింగపూర్ ప్రభుత్వాన్ని తిరిగి సంప్రదించాలని అథారిటీ సమావేశంలో నిర్ణయించామని తెలిపారు. ఈ సమావేశంలో మొత్తం 12 అంశాలపై చర్చించారు. గతంలో 130 సంస్థలకు జరిగిన భూ కేటాయింపులు, ప్రస్తుత పరిస్థితిపై ముఖ్యమంత్రి మాట్లాడారు. గతంలో భూమి పొందిన వారు, మళ్లీ నిర్మాణాలు చేపట్టే అంశంపై సీఎం చర్చించారు. ఏపీ ఎడ్యుకేషన్ హబ్‌గా కావడానికి ఎలాంటి సంస్థలను ఆహ్వానించాలి, ఎవరికి భూములు కేటాయించాలనే అంశంపై సమావేశంలో ముఖ్యమంత్రి చర్చించారు. సంపద సృష్టికి కేంద్రాలుగా అమరావతిని మార్చేవారికి భూ కేటాయింపులు చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. రైతులు ఆరోజు సీఎం మీద నమ్మకంతో ఒక్క లిటిగేషన్ లేకుండా ఇచ్చారు. ఈ రోజు వారికి ఎంత కౌలు ఉందో అదే ఐదేళ్ల పాటు కొనసాగిస్తారు. అమరావతి పెన్షన్లు కూడా ఇదేలా మరో ఐదేళ్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.

అథారిటీలో గతంలో ఎంత ఉందో అంతే ఉండేలా చర్యలు తీసుకుంటాం. దీని వల్ల పల్నాడు, బాపట్ల అథారిటీలు కూడా ఉంటాయి వాటి ఏరియా తగ్గుతుంది క్యాపిటల్ సిటీ 217 చదరపు కిలోమీటర్లుగా నిర్ణయించాం... వీటిలో 4 గ్రామాలను మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిపింది. సీఆర్డీఏ కమిషనర్ ర్యాప్ట్ ఫౌండేషన్ వద్ద నీటిని తోడేస్తామన్నారు చెన్నై ఐఐటీ బృందం చూశాక అ పని చేయాలని సూచించామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# తెలుగువర్సిటీకి సురవరం పేరు

**అందరు ఆమోదిస్తే అభ్యంతరం లేదు**

**శాసనసభలో సిఎం రేవంత్ ప్రకటన**



హైదరాబాద్,ఆగస్ట్ 2 : తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప రెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందరూ సహకరిస్తే సురవరం ప్రతాప రెడ్డి పేరు పెడదామని ఆయన సభ్యులను కోరారు. ఈ ప్రతిపాదనపై కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రతిపాదన చేశారు. సురవరం ప్రతాప రెడ్డి గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ వైతాళికుడని అన్నారు. ఈ ఆలోచన చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కూనంనేని చెప్పారు. సురవరం ప్రతాప రెడ్డి పేరు అందరూ ఆమోదించాలని సభలోని సభ్యులకు ఆయన పిలుపునిచ్చారు. తన బహువిధ రచనా ప్రక్రియల ద్వారా, నిద్రావస్థలో ఉన్న తెలుగు జాతిని జాగృతం చేసిన వైతాళికుల్లో సురవరం ప్రతాపరెడ్డి ఎన్నదగినవారు. 1896 మే 28న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్‌తాలూకా బోర-వెల్లి గ్రామంలో జన్మించిన ఆయన.. గోల్కొండ పత్రిక సంపాదకులుగా, సమాజ సేవకుడిగా, బహుగ్రంథకర్తగా, భాషా పరిశోధనల ద్వారా ఆంధ్రుల సంస్కృతిని పరివ్యాపితం చేసిన ప్రయోక్తగా తెలుగుజాతికి చిరపరిచితులు. కానీ, అనేక కారణాల వల్ల ఆయనకు నిజంగా రావాల్సినంత ఖ్యాతి దక్కలేదేమో అనిపిస్తుంది. అందుకు, స్వతస్సిద్ధమైన ఆయన స్వభావం కూడా కొంతవరకు కారణమై ఉండొచ్చు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆయన ప్రచారం కోసం అర్రులు చాచింది ఎప్పుడూ లేదు. సాధికారికంగా ఆయన చెప్పే ప్రతి అంశంలోనూ నిశిత పరిశీలనా , పరిశోధనా దృష్టి, లోతైన విషయ పరిపక్వత వాటన్నింటికీ మించిన మానవీయత-నిజాయతీ తొణికిసలాడుతుంటాయి. ప్రచార కండూతి ఏ కోశానా కనిపించదు. కారణం ఏదైనా, సురవరం ప్రతాపరెడ్డికి అర్హమైన హేతుబద్ధమైన స్థానం కల్పించక పోవడం వల్ల ఆయన నష్టపోయినదానికన్నా తెలుగు జాతి నష్టపోయిందే ఎక్కువ. రాజకీయ, సాహిత్య, సంగీతాదిరంగాల్లో తెలుగునాట లబ్ధప్రతిష్టులైన 75 మంది నాటి ప్రముఖుల పేర్లను ఆంధ్ర సచిత్ర వార పత్రికల్లో ధారావాహికంగా ప్రచురించారు. అందులో సురవరం ప్రతాపరెడ్డి వంటి బహుముఖ ప్రజ్ఞాశాలికి చోటుదక్కకపోవడం విచిత్రం.

# సోషల్ మీడియాలో మార్ఫింగ్‌లపై కఠిన చర్యలు

**అసెంబ్లీ వ్యవహారాల రికార్డింగ్..మార్ఫింగ్ నేరం**

**సివిల్ కోర్టు సవరణ బిల్లు ప్రవేశ పెట్టిన శ్రీధర్ బాబు**

**అత్యాచారాల కేసులో ఫాస్‌ట్రాక్ కోర్టులు పెట్టాలన్న కెటిఆర్**

హైదరాబాద్,ఆగస్ట్ 2 : సోషల్ మీడియాలో మార్ఫింగ్ వీడియోల ప్రచారం చట్టాలకు విరుద్ధం అని అసెంబ్లీలో ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సివిల్ కోర్టుల సవరణ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. కేటీఆర్ అడిగినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలపై విచారణ చేస్తామన్నారు. కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షలు చేస్తుందన్నారు. కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలు తెలంగాణ ప్రజల ఆలోచనలకు విరుద్ధంగా ఉండే విచారణ చేస్తున్నామన్నారు. కొత్త చట్టాలపై త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటన చేయబోతున్నామని తెలిపారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రానికి చట్టాలపై ఆ అభిప్రాయాలు తెలిపాయని వెల్లడించారు. సైబర్ క్రైమ్ అరాచకాలను అరికట్టేందుకు కొత్త చట్టాలను తేవడానికి వెనుకాడబోమన్నారు. సైబర్ క్రైమ్ అరాచకాలు తారాస్థాయికి పోయాయని అన్నారు. సోషల్ మీడియాలో మార్ఫింగ్ వీడియోల ప్రచారం చట్టాలకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. కేటీఆర్ అడిగినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలపై విచారణ చేస్తామన్నారు. సభా ప్రాంగణంలో సభను అప్రతిష్టపాలు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. లా అండ్ ఆర్డర్‌కు భంగం కలిగించే విధంగా ఎవరు చేసినా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. క్రిమినల్ చట్టాలపై అందరి అభిప్రాయాలు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేస్తుందన్నారు. అసెంబ్లీ విషయంలో మంత్రి సీతక్కపై మార్ఫింగ్ వీడియోలు ప్రచారం జరిగాయని మండిపడ్డారు. మంత్రి సీతక్క మార్ఫింగ్ వీడియోలపై చర్యలు తీసుకోవాలా వద్దా అనేది ప్రతిపక్షం చెప్పాలన్నారు. అనంతరం సీతక్క వీడియో మార్ఫింగ్ అంశంపై సభలో చర్చ కొనసాగింది. సోషల్ మీడియా పై మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో మాట్లాడుతూ.. సభలో ఏదో ఓ వీడియో తీసుకుని ఇష్టారాజ్యంగా పోస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన మహిళా మంత్రి మీద కూడా అసభ్య కరంగా పోస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం పద్ధతని ప్రశ్నించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్,అసెంబ్లీ లో ఫోటోలు తీయడం నేరమన్నారు. సీరియస్ యాక్షన్ ఉంటుందని తెలిపారు. ఫోటోలు తీశారు అనే ఆరోపణ మీదనే ఓ ఎంపీ నీ సస్పెండ్ చేశారు. ఇక శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సీతక్క మీద తప్పుడు ట్రోలింగ్ చేస్తే చర్యలు తీసుకోవద్దా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష సభ్యులు చర్యలు తీసుకోవద్దు అన్నట్టు వ్యవహారం చేస్తున్నారని అన్నారు. శాసన సభ ప్రొసీడింగ్స్ లైవ్ నీ మార్ఫింగ్ చేయడం బాధాకరం అన్నారు. విచారణ జరిపిస్తామన్నారు. సభ మర్యాదలు అందరూ పాటించాలని అన్నారు. సీరియస్ గా తీసుకుంటామన్నారు. సభ సెక్రటేరియట్ నీ అప్రదిష్టపాలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. దీనిపై స్పందించిన స్పీకర్ మార్ఫింగ్ వీడియో పై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, సీరియస్ గా పరిగణిస్తామని అన్నారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సివిల్ కోర్టుల సవరణ బిల్లుకు మద్దతిస్తున్నామని, స్వాగతిస్తున్నామన్నారు. రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగంలోనే న్యాయ వ్యవస్థకు బలమైన పునాదులు వేశారు. రాజకీయ వైరుధ్యాలు ఉన్నప్పటికీ న్యాయ వ్యవస్థను పరిరక్షించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలి. అత్యాచారాలు, సైబర్ నేరాల బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ప్రతి జిల్లాలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులను వెంటనే శిక్షించాలని కోరారు. ఇతరులెవరూ ఇలాంటి ఘటనలకు పాల్పడబోరని కేటీఆర్ అన్నారు. బాధ్యులు ఎవరైనా ఉంటే చర్యలు తీసుకోవాలని అన్నారు. అందరి మీద ఇలాంటి దాడి జరుగుతుందన్నారు. నెహ్రూ నుండి.. ఇప్పటి వరకూ మన మీద వరకు క్యారెక్టర్ దెబ్బ తినేలా ట్రోల్ చేస్తున్నారని తెలిపారు. అందరి మీద చర్యలు తీసుకోవాలన్నారు. సభలో కూడా గౌరవ ప్రదమైన మాటలు మాట్లాడేలా రూలింగ్ ఇవ్వాలన్నారు.

# స్వాతంత్ర్య పోరాట యోధుడు..

## జాతీయ పతాక రూపకర్త పింగళి

విజయవాడ,ఆగస్ట్ 2 : జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య.. మహాత్మాగాంధీ సమకాలికుల్లో ఒకరు..పింగళి 1876,ఆగస్టు 2న కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రులో జన్మించారు.పింగళి వెంకయ్య స్వాతంత్ర్య సమరయోధుడే గాకుండా ...మన జాతీయ పతాక రూపకర్త. మన త్రివర్ణ పతాకం గాంధిజీ ప్రోద్భలంతో పుట్టింది మన తెలుగు నేలమీదే. కాషాయ రంగు హిందువులకు చిహ్నమని, ఆకుపచ్చ ముస్లిములకు అని పేర్కొనడముతో ఇతర మతాలకు కూడా ప్రాధాన్యత ఇస్తూ గాంధీజీ సూచనలపై ఆకుపచ్చ, కాషాయ రంగులతో పాటు తెలుపును కూడా చేర్చి త్రివర్ణపతాకాన్నిపింగళి రూపొందించాడు. మధ్యలో ఉండే రాట్నము గ్రామీణ జీవితాన్ని రైతు కార్మికత్వాన్ని స్ఫురింపచేస్తుందని అయన భావన. మన ఆశయాలకు భారతదేశంఅవలంబించే సత్యం, అహింసలకు చిహ్నమే మన త్రివర్ణ పతాకం. అప్పట్లో ఈ జెండాను పింగళి కాంగ్రెస్ పార్టీకి స్వాతంత్ర్యోద్యమములో రూపొందించాడు 1947 జులై 22 న భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి తీర్మానం చేస్తూ త్రివర్ణ పతాకములోని రాట్నము స్థానములో మన పూర్వ సంస్కృతికి చిహ్నమైన సారనాథ్ స్తూపంలోని ఆశోకుని ధర్మచక్రాన్ని చేర్చారు ఈ మార్పు తప్పితే పింగళి రూపొందించిన జెండాకు మన జాతీయ జెండాకు తేడా ఏమి లేదు.ఆ విధముగా మన జాతీయ జెండా రూపకర్తగా పింగళి వెంకయ్య గారు మన చరిత్రలో స్థానము సంపాదించుకున్నారు.1963 జులై 4 న కన్ను ముశారు అయన చివరి కోరిక అయన మృత దేహంపై జాతీయ జెండాను కప్పి శ్మశాన వాటికలో దగ్గర్లో ఉన్న రావి చెట్టుకు ఆ జెండా కట్టవలసినది కోరాడు. హైదరాబాదులో ట్యాంక్ బండ్ మీద ప్రభుత్వమూ అయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించి అయన దర్శన భాగ్యము ప్రజలకు కలుగజేశారు. జాతీయ పతాకం ఎగురుతున్నంత కాలం గుర్తుంచు కోవలసిన మహనీయుడు పింగళి వెంకయ్య అనడంలో సందేహం లేదు.

# అవయవదానం ఆవశ్యకతను గుర్తించాలి

***అవయవాలు దక్కక ఏటా ఐదులక్షల మంది మృతి***

***జీవన్ దాన్ కార్యక్రమంలో మంత్రి సత్యాకుమార్***

***అవయవదానంపై సంతకం చేసిన మంత్రి***

విజయవాడ,ఆగస్ట్ 2 : అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నా... ప్రజల్లో మార్పు రాలేదన్నారు. జీవన్ దాన్ పై అవగాహన కార్యక్రమంలోపాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే బోండా ఉమ పాల్గొన్నారు. ఇదే వేదిక పై అవయవదానానికి అంగీకరిస్తూ మంత్రి సత్యకుమార్ సంతకం చేశారు. అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులను సత్యకుమార్, బోండా ఉమ సత్కరించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ.. మన రాష్ట్రం లో 260 మంది అవయవ దానంకోసం ముందుకు వచ్చారన్నారు. తెలంగాణలో ఎనిమిది వందల మంది ముందుకు వచ్చారన్నారు. 90 వేల మంది అవయవ దానం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. యేటా ఐదు లక్షల మంది అవయవాలు చెడిపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని సత్యకుమార్ అన్నారు. జాతీయ స్థాయిలో చాలా స్వల్పంగా ఈ అవయవ దానమ రిజిస్ట్రేషన్ లు ఉన్నాయన్నారు. కొంత మందికి మతాచారాలు అడ్డుగా వస్తున్నాయని అంటున్నారన్నారు. తీసుకునేందుకు లేని అభ్యంతరం ఇచ్చేందుకు లేదన్నారు. ఈ దేవుడు అయినా పరులకు మంచి చేయమనే చెబుతారన్నారు. డయాలసిస్ సెంటర్ల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. కిడ్నీల మార్పిడి కోసం ప్రజలు చాలా మంది క్యూలో ఉన్నారన్నారు. అవయవ దానం వల్ల అంత్యక్రియలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ అంశాలను సీఎం చంద్రబాబు దృష్టి కి తీసుకెళతానని సత్య కుమార్ పేర్కొన్నారు. అవయవదానం చేసిన వారి అంత్యక్రియల్లో కలెక్టర్, ఎస్పీ పాల్గొని వీరవందనం చేసేలా మార్పులు తెస్తామన్నారు. ఆర్థికంగా కూడా ఆ కుటుంబానికి ఎంతో కొంత సాయం అందించాలని సత్యకుమార్ పేర్కొన్నారు. ఈ మార్పులపై సీఎం సానుకూలంగా స్పందిస్తారని భావిస్తున్నానన్నారు. అవయవదానంలో భాగస్వామ్యం అవుతున్న వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ఉన్న వారికి ధన్యవాదాలు తెలిపారు. ఇంకా సమాజంలో మార్పు రావాలి, ప్రజల్లో చైతన్యం కలిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సత్యకుమార్ పేర్కొన్నారు. వేల మందికి పునర్జన్మ కలిగించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. తాను కూడా బాధ్యతగా అవయవదానానికి అంగీకరిస్తూ సంతకం చేశానన్నారు. తన కుటుంబ సభ్యులకు సైతం సమాచారం ఇచ్చానని సత్యకుమార్ తెలిపారు.

# బిందు సేద్యం రాయితీలు అందించండి

## అధికారులకు మంత్రి అచ్చన్నాయుడు ఆదేశం

అమరావతి,ఆగస్ట్2 : రాష్ట్ర రైతుల కోసం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతులకు తక్షణమే రాయితీపై బిందు సేద్యం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో రాయితీపై బిందు సేద్యం అమలుపై అధికారులతో మంత్రి అచ్చెన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.1167 కోట్ల బకాయిలు పెట్టిందని తెలిపారు. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో బిందు సేద్యం నిర్వీర్యమైందన్నారు. దేశంలో ముందున్న రాష్ట్రాన్ని దేశంలోనే చివరి స్థానంలోకి జగన్ ప్రభుత్వం తీసుకెళ్లిందని విమర్శలు గుప్పించారు.

# ఏటా లంక గ్రామాల్లో ప్రజల విలవిల

**శాశ్వత పరిష్కారంపై దృష్టిలేని ప్రభుత్వం**

**వరదలు వస్తున్నా శాశ్వత చర్యలు శూన్యం**

రాజమహేంద్రవరం,ఆగస్ట్ 2 : ఏటా గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో లంకగ్రామాలు విలవిల్లాడు తున్నాయి. గతేడాది ఇలాంటి ఉపద్రవమే వచ్చినా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు. నాలుగైదు రోజులుగా కోనసీమ జిల్లాలోని లంకలు వరద నీటిలో నానుతున్నాయి. ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజీ నుంచి నీరు దిగువకు వదలడంతో వైనతేయ, వశిష్ట, వృద్ధ గౌతమి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుంటాయి. కోనసీమ జిల్లాలో తొమ్మిది మండలాల్లోని 30 గ్రామాలపై వరద ప్రభావం తీవ్రంగా పడుతోంది. ఆయా లంక గ్రామాల్లో నివసించే వేలాది కుటుంబాలు ప్రతియేటా వరదల సమయంలో తీవ్రంగా నష్టపోతున్నారు. వరదల్లో ప్రాణాలు కోల్పోవడమే గాకుండా, సర్వం కోల్పోయి, కట్టుబట్టలతో బయటపడుతున్నారు. ఇలాంటి వారికి ఏటా కలుగుతున్న సమస్యలపై ప్రభుత్వం ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోవడం లేదు. వరద బారిన పడ్డవారు జీవనం కోసం పట్టణ కేంద్రాల్లో కూలి పనులు, వివిధ వృత్తులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. చాలామంది గ్రామాల నుంచి బయటకు వెళ్లే పరిస్థితులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెనలు నిర్మించడం ద్వారా కొంత ఊరట లభించే అవకాశాలు ఉన్నా... దశాబ్దాల కాలంగా వీటి నిర్మాణ హామీ కాగితాలకే పరిమితమైంది. దీంతో, ఏటా ముంపు తప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.గన్నవరం మండలంలో బూరుగులంక, అరిగెలవారి పాలెం, గంటి పెదపూడి లంక, కనకాయలంక, జొన్నలంక, కె.ఏనుగుపల్లి, ఏనుగుపల్లి లంక, కందాలపాలెం, నాగుల్లంక, శివాయలంక, కాట్రగడ్డ, కె.ముంజవరం గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. మామిడికుదురు మండలం అప్పనపల్లి, పెదపట్నం, పెదపట్నం లంక, దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడి బాడవ గ్రామాలు, అప్పనపల్లి కాజ్‌వేపైకి వరద పోటెత్తినప్పుడు వీరి బతుకులు ఛిద్రం అవుతున్నాయి. వాకలగరువులో కరకట్ట దిగువన ఫిషర్మెన్ పేటలో సుమారు వంద కుటుంబాలకుపైగా జీవిస్తున్నారు. ఏటా వరదల సమయంలో ఒడ్డు కోతకు పలు ఇళ్లునదీ గర్భంలో కలిసిపోతున్నాయి. మూడు లంక గ్రామాలకు ఆర్ అండ్ బి రహదారిలో పాశర్లపూడిలో కరకట్ట దిగువ కాజ్‌వే ఎత్తు చేస్తే వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం ఉండదని అంటున్నారు. 600 మీటర్ల మేర కాజ్‌వే వద్ద ఐదడుగుల ఎత్తులో బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి వరద నీరు వస్తే లంక గ్రామాలు ముంపునకు గురవు తున్నాయి. రాకపోకలు నిలిచిపోతుండడంతో ఉపాధికి దూరమవుతున్నారు. ఏటా ఇదే పరిస్థితి. వరద ఉంటే ఆ రోజు పస్తులే అన్నట్టుగా వారి పరిస్థితి తయారైంది. కరకట్ట ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడిన సమయంలో మురుగు నీటిని నదిలో మళ్లించేందుకు బ్రిటిష్ వారి హయాంలో అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు నిర్మించారు. నేటికీ వీటినే వాడుతున్నారు. ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వరదల సమయంలో లీకుల ద్వారా వరద పోటెత్తి పంటలకు నష్టం వాటిల్లుతోంది.కాలనీలను ముంచెత్తుతోంది. ఈ దృష్ట్యా స్లూయిజ్‌లను పటిష్ట పర్చాల్సి ఉంది. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం నుండి ఎటువంటి సాయమూ అందక ఆయా లంక గ్రామాల ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. మండలంలోని కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, దొడ్డిపట్ల గ్రామాల వరద బాధితుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గతంలో వరదల సమయంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు, తాగునీరు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదని బాధితులు వాపోతున్నారు. పునరావాస కేంద్రాలకు వస్తేనే భోజనాలు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. లంక గ్రామాల ప్రజలు మాత్రం తమ ఇళ్లను, పశువులు, మేకలు, కోళ్లను వదిలి ఎక్కడో దూరప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లడానికి నిరాకరిస్తున్నారు. దీంతో, వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చిన్నపిల్లలు, వృద్ధులు, బాలింతలకు అధికారులు కనీసం తాగునీరు, పాలు వంటి వాటిని కూడా అందించలేదు. పడవల్లో బయటకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకొనే పరిస్థితి లేక పేదలు ఆకలితో అలమటిస్తున్నారు. గత పది రోజులుగా ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమను భోజనాలు, తాగునీరు వంటివి అందించి ఆదుకో వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. పీకల్లోతు మునిగిపోయినా ఇప్పటి వరకు మమ్మల్ని పట్టించుకున్న నాథుడే లేదు. వరద బాధితుల గోడు ప్రభుత్వానికి పట్టకపోవడం చాలా బాధ కలిగిస్తోంది.

# ఎక్సైజ్ శాఖ కొత్త పాలసీ రూపకల్పన

**ఆరు రాష్ట్రాల్లో నాలుగు బృందాలతో అధ్యయనం**

**అధికారులతో సమీక్ష చేసిన సిఎం చంద్రబాబు**

అమరావతి,ఆగస్ట్ 2 : ఎక్సైజ్ శాఖ కొత్త పాలసీ రూపకల్పనపై ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. పాలసీ రూపకల్పనకు వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఆరు రాష్ట్రాల్లో అధ్యయనం కోసం నాలుగు టీంల ఏర్పాటు చేయగా... ఒక్కో టీంలో ముగ్గురు చొప్పన అధికారులు ఉండనున్నారు. ఈ మేరకు సిఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రి కొల్లు రవీంద్ర పలువురు అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక-తెలంగాణ, తమిళనాడు-కేరళ రాష్ట్రాలకు నాలుగు బృందాలు వెళ్లి అధ్యయనం చేయనున్నారు. ఆయా రాష్ట్రాల్లోని ఎక్సైజ్ పాలసీ, షాపులు, బార్లు, ధరలు, మద్యం కొనుగోళ్లు, నాణ్యత, చెల్లింపుల విధానం, డిజిటల్ పేమెంట్ అంశాలపై బృందాలు అధ్యయనం చేయనున్నాయి. ట్రాక్ అండ్ ట్రేస్, డీ-ఎడిక్షన్ సెంటర్ల నిర్వహణ వంటి అంశాలపైనా అధికారులు దృష్టి సారించనున్నారు. ఆయా రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలపై ప్రభుత్వానికి నాలుగు బృందాల అధికారులు నివేదికను సమర్పించ నున్నారు. ఈ నెల 12వ తేదీలోగా నివేదికలు సమర్పించాలని నాలుగు అధ్యయన బృందాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబర్ నెలాఖరు నాటికి కొత్త ఎక్సైజ్ విధానాన్ని సిద్ధం చేసేలా ఏపీ సర్కార్ ప్రణాళికలు రూపొందిస్తోంది. అక్టోబర్ నెల నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీని ఏపీ ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఏపీలో అమలులో ఉన్న మద్యం విధానం మారనుంది. కొత్త పాలసీని తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నహాలు చేస్తుంది. నాటి వైసీపీ ప్రభుత్వం మద్యం కొనుగోలు, విక్రయాల్లో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, జే బ్రాండ్‌తో నాణ్యత లేని మద్యాన్ని సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకున్నారని కూటమి నేతలు ఆరోపించారు. మద్యం, ఇసుక, నేరాలపై తీవ్రస్థాయిలో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి రాష్ట్రంలో నూతన ఎక్సైజ్ పాలసీని తీసుకురానున్నది. నివేదికలు అందిన తరువాత సెప్టెంబర్ చివరి వారం నాటికి గాని, అక్టోబర్ మొదటి వారం నుంచి గాని నూతన ఎక్సైజ్ పాలసీని అమలులోకి తీసుకురానున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 3 ఆగస్టు 2024





# ‘నేను మీ కెప్టెన్ రోహిత్‌ని’..

## అభిమానులకు హిట్ మ్యాన్ సందేశం

భారత క్రికెట్‌లో కొత్త శకం మొదలైంది. రాహుల్ ద్రవిడ్ నిష్క్రమణ, ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియామకం తర్వాత శ్రీలంకతో టీ20 సిరీస్‌లో టీమిండియా ప్రదర్శన కొత్త ఆశలను రేకెత్తించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత్ అద్భుత ప్రదర్శన చూపి 3-0తో సిరీస్‌ని కైవసం చేసుకుంది. టీ20 ఫార్మాట్ తర్వాత ఇప్పుడు వన్డే ఫార్మాట్ వంతు వచ్చింది. రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు 50 ఓవర్ల ఫార్మాట్‌లో శ్రీలంకను క్లీన్ స్వీప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే టీ20తో పోలిస్తే వన్డేల్లో భారత జట్టులో చాలా తేడా ఉంది. చాలా మంది అనుభవజ్ఞులు టీమిండియాకు తిరిగి వచ్చారు. భారత క్రికెట్‌లోని ఇద్దరు దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఎనిమిది నెలల తర్వాత వన్డేల్లో పునరాగమనం చేస్తున్నారు. దశాబ్ద కాలంగా 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఆధిపత్యం చెలాయించిన ఈ జోడీ.. గుర్తిండిపోయేలా పునరాగమనం చేయాలనే లక్ష్యంతో ఉంది. వీరిద్దరూ టీ20 ప్రపంచకప్ తర్వాత టీ20 ఇంటర్నేషనల్ నుంచి రిటైర్ అయ్యారు. ఇప్పుడు ఇద్దరూ వన్డేలు, టెస్టులపైనే పూర్తిగా దృష్టి సారించారు. గతేడాది వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్‌లో ఎదురైన ఓటమిని మరిచిపోయి కొత్త శుభారంభం చేయాలని వీరిద్దరూ భావిస్తున్నారు. వీరిద్దరితో పాటు కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్ కూడా వన్డే జట్టులోకి తిరిగి వచ్చారు. సిరీస్ ప్రారంభానికి ముందు.. రోహిత్ భారత క్రికెట్ అభిమానులందరికీ ప్రత్యేకమైన, భావోద్వేగ సందేశాన్ని ఇచ్చాడు. బీసీసీఐ (%దీజజ×%) షేర్ చేసిన వీడియో కొన్ని వారాల క్రితం అభిమానులు.. ఆటగాళ్లు పంచుకున్న అన్ని చిరస్మరణీయ క్షణాలను సంగ్రహించింది. బార్బడోస్‌లో రోహిత్ కెప్టెన్సీ షాట్ నుండి మెరైన్ డ్రైవ్ దగ్గర విజయ పరేడ్.. వాంఖడే స్టేడియంలో ప్రతిష్టాత్మకమైన సన్మాన కార్యక్రమం వరకు ఈ వీడియోలో చూపిస్తుంది. భారత్‌కు పొట్టి ఫార్మాట్‌లో ఆడాలనే కోరిక తనకు ఇంకా ఉందని రోహిత్ వీడియోలో చెప్పాడు. అభిమానులను ఉద్దేశించి కెప్టెన్ మాట్లాడుతూ, గత నెల రోజులు తనకు చాలా ప్రత్యేకమైనవని.. జ్ఞాపకాలతో నిండిపోయాయని అన్నాడు. గత నెల జ్ఞాపకాలతో నిండిన నెల.. చరిత్రలో నిలిచిపోయింది.. అది ఎప్పటికీ తనతో నిలిచిపోయే క్షణం అని తెలిపాడు. ఈ సిరీస్ కొత్త, పాత ప్రతిభతో కొత్త శకానికి నాంది పలుకుతుందని రోహిత్ చెప్పాడు. ‘కొత్త శకానికి నాంది పలికి మళ్లీ మైదానంలోకి రావాల్సిన సమయం ఆసన్నమైంది. కొత్త కోచ్‌తో కొత్త ప్రారంభం.. భారత క్రికెట్‌కు అత్యంత ప్రాధాన్యతనిచ్చే భాగస్వామ్యం.. రీసెట్ బటన్‌ను నొక్కడానికి ఇది మంచి సమయం.. నేను మళ్లీ మైదానంలోకి రావాల్సిన సమయం వచ్చింది. అదే శక్తి, ఉత్సాహంతో టీమ్ ఇండియా కొంత మంది కొత్త, మరికొంత పాత ముఖాలతో మైదానంలోకి దిగనుంది. ఇది టీమ్ ఇండియా, ఇది మీ కెప్టెన్ రోహిత్ శర్మ.’ అని అన్నాడు. ఆగస్టు 2 నుంచి మూడు వన ్డేల సిరీస్‌లో శ్రీలంకతో భారత్ ఆడనుంది. సిరీస్‌లో చివరి మ్యాచ్ ఆగస్టు 7న జరగనుంది.

# స్వప్నిల్‌కు రైల్వే గిఫ్ట్..

పారిస్ ఒలింపిక్స్‌లో గురువారం జరిగిన పురుషుల 50 మీటర్ల 3-పొజిషన్ ఈవెంట్‌లో భారత షూటర్ స్వప్నిల్ కుసాలే కాంస్య పతకాన్ని సాధించి చరిత్ర సృష్టించాడు. అతను సాధించిన ఈ ప్రత్యేక విజయానికి సెంట్రల్ రైల్వే బహుమతి ఇచ్చింది. ఈ ఈవెంట్‌లో భారత్‌కు పతకం సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో కుసాలే ఏడో స్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్ 2024లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నందుకు గాను.. భారత షూటర్ స్వప్నిల్ కుసాలే సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ సెల్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా పదోన్నతి పొందారు. ఇంతకు ముందు కుసాలే టిక్కెట్ కలెక్టర్‌గా పనిచేస్తుండే వాడు. మరోవైపు.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుసాలేకు కోటి రూపాయల రివార్డును ప్రకటించారు. కుసాలేకు మహారాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల రివార్డును ప్రకటిస్తోందని, ఒలింపిక్స్ నుంచి తిరిగి రాగానే అతడికి ఘనంగా స్వాగతం పలుకుతామని షిండే తెలిపారు. మరోవైపు.. ఈరోజు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు భాగంగా.. స్పీకర్ ఓం బిర్లా స్వప్నిల్ కుసలేను అభినందించారు. పారిస్ ఒలింపిక్స్‌లో పురుషుల 50 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించిన స్వప్నిల్ కుసాలేను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభినందించారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఏడో స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో కూడా, స్వప్నిల్ మోకాలి మరియు ప్రోన్ రౌండ్‌ల తర్వాత ఆరో స్థానంలో ఉన్నాడు. అతను స్టాండింగ్ పొజిషన్‌లో అద్భుతంగా పునరాగమనం చేసాడు. తన మొదటి ఒలింపిక్స్‌లో భారతదేశానికి పతకాన్ని సాధించాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో కుసాలే అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. 60 షాట్‌లలో 590 పాయింట్లతో మొదటి ఎనిమిది షూటర్‌లలో నిలిచాడు. ఇందులో 38 ఇన్నర్ 10లు ఉన్నాయి. కుసాలేతో పాటు మరో భారత షూటర్ ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో 589 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచింది.

# అర్హత లేని బాక్సర్ ను బరిలోకి దింపి మోసం..

పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో మోసం జరిగిందని ఆరోపణలున్నాయి. ఆగస్టు 1న జరిగిన మహిళల 66 కేజీల వెయిట్ కేటగిరీ బౌట్‌పై వివాదం మొదలైంది. ఇటలీకి చెందిన ఏంజెలా కారినీ, అల్జీరియాకు చెందిన ఇమాన్ ఖలీఫ్‌లు ముఖాముఖి తలపడగా, ఏంజెలా కేవలం 46 సెకన్ల వ్యవధిలో మ్యాచ్ నుంచి వైదొలిగింది. దీంతో అల్జీరియా బాక్సర్ ఇమాన్ ఖలీఫ్ విజేతగా నిలిచింది. ఈ వివాదమంతా ఇమాన్ ఖలీఫ్ ‘జెండర్ చెక్’కి సంబంధించినది. నిజానికి, ఇమాన్ ఖలీఫ్ శరీరంలో టెస్టోస్టెరాన్ హార్మోన్ మొత్తం అసాధారణంగా ఉంది. ఈ కారణంగా, ఆమె ‘లింగ పరీక్ష’లో విఫలమవడంతో 2023 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించలేదు. ఆ తర్వాత ఆమెకు పారిస్ ఒలింపిక్స్‌లో చోటు దక్కడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేని వారిని ఒలింపిక్స్‌లో ఆడించడంపై విమర్శలు వస్తున్నాయి. జెండర్ టెస్టులో ఫెయిల్ అయిన బాక్సర్లు మహిళా బాక్సర్లతో పోటీ పడేందుకు ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ అనుమతిచ్చింది. ఇది పెద్ద వివాదంగా మరుతోంది. కొన్ని పంచుల తర్వాత కారిని పోరాటాన్ని వదులుకుంది. ఇది ఒలింపిక్ బాక్సింగ్‌లో అత్యంత అసాధారణమైన సంఘటన. కారిని ఖలీఫ్ కరచాలనం చేయడానికి కూడా నిరాకరించింది. బయలుదేరే ముందు రింగ్‌లో ఏడ్చింది. ఖలీఫ్ అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్ యొక్క 2022 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని గెలుచుకున్న ఔత్సాహిక బాక్సర్. గత సంవత్సరం ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, ఆమెలో టెస్టోస్టెరాన్ స్థాయిలు పెరిగినట్లు పరీక్షలు పేర్కొన్న తర్వాత గోల్డ్ మెడల్ మ్యాచ్‌కు ముందు వైదొలగాల్సి వచ్చింది. ఇప్పుడు ఒలంపిక్స్‌లో ఇమాన్ ఖలీఫ్ తొలి మ్యాచ్ గెలిచిన తర్వాత.. ఓ మహిళ ముందు పురుషుడిని ఎందుకు బరిలోకి దింపారనే ప్రశ్నలు సోషల్ మీడియాలో తలెత్తుతున్నాయి. ఐబీఏ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)పై కూడా ప్రశ్నలు సంధించింది. ఐఓసీ నిబంధనలను ఉల్లంఘిస్తోందని ఐబీఏ పేర్కొంది. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని మాట్లాడుతూ, ‘పురుషుల జన్యు లక్షణాలు ఉన్న అథ్లెట్లను మహిళల పోటీల్లోకి అనుమతించకూడదని నేను భావిస్తున్నాను. మీరు ఎవరిపైనా వివక్ష చూపాలని కోరుకోవడం వల్ల కాదు, మహిళా అథ్లెట్ల సమాన నిబంధనలతో పోటీ పడే హక్కును కాపాడాలి.’ అని జార్జియా మెలో పేర్కొన్నారు.

# భారత్-శ్రీలంక తొలి వన్డే టై

## రెండు బంతుల్లో మారిన ఫలితం




కొలంబో: మూడు టీ20ల సిరీసలో క్లీన్‌స్వీప అయిన శ్రీలంక..భారత్‌తో తొలి వన్డేలో పుంజుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీసలో భాగంగా శుక్రవారం ఉత్కంఠ భరితంగా జరిగిన మొదటి వన్డేను ఆతిథ్య జట్టు టై చేసింది. మొదట శ్రీలంక 50 ఓవర్లలో 230/8 స్కోరు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ వెల్లలగే (67 నాటౌట్), నిస్సాంక (56) హాఫ్ సెంచరీలు సాధించారు. అక్షర్, అర్ష్‌దీప్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో భారత్ 47.5 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటైంది. రోహిత్ (58) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, అక్షర్ (33), కేఎల్ రాహుల్ (31), శివమ్ దూబే (25) రాణించారు. అసలంక, హసరంగ మూడేసి, వెల్లలగే రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు.

**ఆఖర్లో తారుమారు..:**

వాస్తవంగా..మ్యాచ్‌లో భారత్ విజయం అంచులదాకా వచ్చింది. 47 ఓవర్లు ముగిసే సరికి మనోళ్ల స్కోరు 226/8. నెగ్గేందుకు మరో ఐదు పరుగులు చేస్తే చాలు. అప్పటికి శివమ్ దూబే క్రీజులో ఉన్నాడు. అతడికి జతగా అర్ష్‌దీప్ వచ్చాడు. విజయంపై భారత్ ధీమాగానే ఉన్నా..స్పిన్నర్ అసలంక రెండు బంతుల్లో ఫలితాన్ని మార్చేశాడు. అసలంక వేసిన 48వ ఓవర్ మూడో బంతికి దూబే ఫోర్ కొట్టాడు. ఒక పరుగు చేస్తే భారత్‌దే విజయం. అయితే నాలుగో బంతికి దూబేను ఎల్బీడబ్ల్యూగా అసలంక బలిగొన్నాడు. ఇక ఒక పరుగే కదా..అర్ష్‌దీప్ లాగించేస్తాడనే ధీమా. అయితే అతడినీ అసలంక ఎల్బీ చేయడంతో మ్యాచ్ టై అయ్యింది. అంతకుముందు రోహిత్, గిల్ తొలి వికెట్‌కు 75 రన్స్‌తో మెరుపు ఆరంభం ఇచ్చారు. ఈదశలో లంక స్పిన్నర్లు విజృంభించడంతో భా రత్ వడివడిగా వికెట్లు కోల్పోయింది. కానీ కేఎల్ రాహుల్, అక్షర్ ఓపిగ్గా ఆడి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. వీరిద్దరు త్వరత్వరగా నిష్క్రమించగా మ్యాచ్‌పై శ్రీలంక పట్టు బిగించింది. కాగా..టీమిండియా మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్ మృతికి సంతాపంగా భారత ఆటగాళ్లు నల్ల ఆర్మ్‌బ్యాండ్లు ధరించి బరిలో దిగారు.

**సంక్షిప్తస్కోర్లు**

శ్రీలంక: 50 ఓవర్లలో 230/8 (వెల్లలగే 67 నాటౌట్, నిస్సాంక 56, హసరంగ 24, అక్షర్ 2/33, అర్ష్‌దీప్ 2/47)
భారత్: 47.5 ఓవర్లలో 230 ఆలౌట్ (రోహిత్ 58, అక్షర్ 33, రాహుల్ 31, అసలంక 3/30, హసరంగ 3/58, వెల్లలగే 2/39).

# చేతికి నల్ల రంగు బ్యాండ్లతో భారత ఆటగాళ్లు!!

మూడు మ్యాచుల టీ20 సిరీస్‌ను గెలిచి మంచి ఊపు మీదున్న టీమ్ ఇండియా అదే ఉత్సాహంతో వన్డే సిరీస్‌నూ కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలో కొలంబో వేదికగా శ్రీలంకతో తొలి వన్డే మ్యాచులో తలపడుతోంది. ఈ మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు చేతికి నల్ల రంగు బ్యాండ్లతో బరిలోకి దిగారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. భారత ఆటగాళ్లకు నల్ల రంగు బ్యాండ్లతో బరిలోకి దిగడానికి ఓ కారణం ఉంది. బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతూ టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ అన్షుమాన్ గైక్వాడ్ జూలై 31(బుధవారం) కన్నుమూశారు. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్, కోచ్ అన్షుమాన్ గైక్వాడ్ కు నివాళిగా టీమ్‌ఇండియా ఆటగాళ్లు నల్ల రంగు బ్యాండ్లలు ధరించారు. అన్షుమాన్ గైక్వాడ్ టీమ్‌ఇండియా తరుపున మొత్తం 40 టెస్టులు, 15 వన్డే మ్యాచ్ లు ఆడాడు. రెండింటిలో కలిపి 2254 పరుగులు చేశాడు. టెస్టుల్లో 1983లో జలంధర్ లో పాకిస్థాన్ పై 201 పరుగుల అత్యధిక స్కోరు చేశాడు. అంతేకాదు.. తన వన్డే కెరీర్ లో అతను రెండు సెంచరీలతో 1154 పరుగులు చేశాడు. గైక్వాడ్ 1997-1999 మధ్య, అదేవిధంగా 2000 సంవత్సరంలో రెండు దఫాలు భారత జట్టుకు ప్రధాన కోచ్ గా పనిచేశాడు. అతని కోచింగ్ లో భారత్ జట్టు 2000 సంవత్సరంలో ఛాంపియన్స్ ట్రోఫీలో రన్నరప్ గా నిలిచింది. అతను కోచ్ గా ఉన్న సమయంలోనే అనిల్ కుంబ్లే న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో టెస్టు ఇన్నింగ్స్ లో 10 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్ గా రికార్డు సృష్టించాడు. గైక్వాడ్ 1990లలో జాతీయ సెలెక్టర్ గా, ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పనిచేశాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచిన శ్రీలంక బ్యాటింగ్ ఎంచుకుంది. 25 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. పాతుమ్ నిస్సాంక (51), జనిత్ లియానాగే (1) లు క్రీజులో ఉన్నారు.

# ఊరించి.. ఉసూరుమనిపించి

ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో తొలిసారి సెమీస్‌కు చేరిన భారత జోడీగా ధీరజ్-అంకిత భకత్ రికార్డు నెలకొల్పింది. అంతేకాకుండా పతకంపైనా ఆశలు రేపినా సఫలం కాలేకపోయారు. శుక్రవారం మొదట క్వార్టర్స్‌లో భారత జోడీ 5-3 తేడాతో కనాలెస్-గొంజాలెజ్ (స్పెయిన్)ను ఓడించి సెమీసలో అడుగుపెట్టింది. సెమీస్‌లో కొరియాను ఎదుర్కొన్న భారత ఆర్చర్లు ప్రభావం చూపలేక 2-6తో ఓటమిపాలై కాంస్య పతక పోరుకు సిద్ధమయ్యారు. ఇందులో యూఎసఏకు చెందిన బ్రాడీ ఎలిసన్-క్యాసీ కాఫ్‌హోల్డ్ పూర్తి ఆధిపత్యం చూపారు. తొలి రెండు సెట్లను అంకిత 7తో ఆరంభించడం దెబ్బతీసింది. తెలుగు కుర్రాడు ధీరజ్ మాత్రం 10 పాయింట్లు సాధిస్తూ ఆధిక్యంలో ఉంచేందుకు ప్రయత్నించాడు. అటు బ్రాడీ స్టన్నింగ్ షాట్లతో రెండో సెట్‌ను 4-0తో ముగించాడు. అయితే కీలక మూడో సెట్‌లో అంకిత 10తో ఆరంభించగా నాలుగు బాణాలు కూడా యెల్లో జోన్‌లోనే దిగాయి. దీంతో భారత్ 2-4తో పోటీలో నిలిచింది. కానీ నాలుగో సెట్‌ను అంకిత 8తో ఆరంభించగా, అటు యూఎస్ 10తో ముందుకెళ్లడంతో భారత్ కోలుకోలేకపోయింది. చివరకు 2-6తో ఓడి ఇంటిముఖం పట్టాల్సి వచ్చింది.

## కీర్తి గ్లామర్ కు పోటీ ఇవ్వగలరా?



సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ గత ఏడాది తెలుగులో దసరా మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. తరువాత తమిళంలో జయం రవి హీరోగా తెరకెక్కిన సైరన్ సినిమాతో ఆడియన్స్ ని పలకరించింది. ఈ సినిమా డైరెక్ట్ గా ఓటీటీలో రిలీజ్ అయ్యి మంచి ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. దసరా సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. దాని తర్వాత మరల తెలుగులో ఈ బ్యూటీ కొత్త సినిమాలకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. కొన్ని కథలు వింటున్నట్లు మాత్రం టాక్ వినిపిస్తోంది.

అయితే తమిళంలో మూడు, హిందీలో ఒక సినిమా ప్రస్తుతం కీర్తి సురేష్ చేతిలో ఉన్నాయి. హిందీలో వరుణ్ ధావన్ కి జోడీగా బేబీ జాన్ సినిమాలో కీర్తి సురేష్ నటిస్తోంది. తమిళంలో విజయ్ హీరోగా వచ్చి సూపర్ హిట్ అయిన తెరికి రీమేక్ గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అట్లీ ఈ సినిమాని హిందీలో వేరొకరితో కలిసి నిర్మిస్తున్నారు. అలాగే రీసెంట్ గా కీర్తి సురేష్ నటించిన రఘు తాత అనే తమిళ్ మూవీ ట్రైలర్ ప్రేక్షకుల ముందుకొచ్చింది.

కామెడీ ఎంటర్టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమా ఆగష్టు 15న రిలీజ్ కాబోతోంది. రివాల్వర్ రీటా అనే మరో సినిమా షూటింగ్ స్టేజ్ లో ఉంది. కెరియర్ ఆరంభంలో బొద్దుగా ఉండే కీర్తి సురేష్ తరువాత స్లిమ్ అయ్యి హాట్ బ్యూటీగా మారిపోయింది. సర్కారువారిపాట సినిమాలో మహేష్ బాబుకి జోడీగా నటించిన కీర్తి చాలా గ్లామర్ గా కనిపించింది. బేబీ జాన్ లో ఆమె నెక్స్ట్ లెవల్ లో తనని తాను షోకేస్ చేసుకోబోతోందని తెలుస్తోంది. స్టార్ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తూ ఉండటంతో కీర్తి సురేష్ పెర్ఫెక్ట్ ఫిజిక్ మెయింటేన్ చేస్తోంది. దీనికోసం రెగ్యులర్ గా వర్క్ అవుట్స్ కూడా చేస్తోందని తెలుస్తోంది. ఫుడ్ విషయంలో కూడా చాలా కేరింగ్ తీసుకుంటుంది. సహజసిద్ధమైన అందాన్ని పదిలంగా కాపాడుకోవడానికి జిమ్ లో నిత్యం కసరత్తులు చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు జిమ్ లో షార్ట్, టీషార్ట్ తో సెల్ఫీ తీసుకుంటున్న ఫోటోని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది.



## నాపై అవన్నీ మంచి పుకార్లే: ప్రగ్య జైస్వాల్



ప్రగ్యా జైస్వాల్ పరిచయం అవసరం లేదు. తెలుగు-హిందీ పరిశ్రమలకు ఈ భామ సుపరిచితం. కానీ ఇటీవల తెలుగు పరిశ్రమలో ఆశించినంత జోరు లేదు. కానీ 2024లో ప్రగ్యకు ఊరటనిచ్చే రెండు సినిమాలు రిలీజ్ కి వస్తున్నాయి. వాటిలో అక్షయ్ కుమార్ %-%ఖేల్ ఖేల్ మే%-% ఒకటి కాగా.. ఎన్బీకే 109 మరొకటి.

ఖేల్ ఖేల్ మే ట్రైలర్ లాంచ్ సందర్భంగా భారతీయ సినీ పరిశ్రమలోని ఇద్దరు బిగ్గెస్ట్ సూపర్ స్టార్స్ - అక్షయ్ కుమార్, నందమూరి బాలకృష్ణలతో కలిసి పనిచేసిన అనుభవం గురించి ప్రగ్యాను మీడియా ప్రశ్నించగా.. ప్రగ్య మాట్లాడుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. %--%రెండు విభిన్న పరిశ్రమల్లో పనిచేసినందుకు నేను కృతజ్ఞురాలి. మంచి సినిమాలు, కథల్లో భాగం కావడమే కాకుండా గుర్తుండిపోయే పాత్రల్లో నటించాలని మాత్రమే ప్రయత్నిస్తున్నాను. నాకు మంచి అవకాశాలు వస్తే భాష ముఖ్యం కాదు%--% అని తెలిపింది.

ఇదే వేదికపై ప్రగ్య మరో కఠినమైన ప్రశ్నను ఎదుర్కొంది. మీపై పుకార్లు వచ్చినప్పుడు అవి మీ కుటుంబంలో కలకలం సృష్టించాయా అని మీడియా ప్రశ్నించింది. దానికి ప్రగ్యా ఇలా సమాధానమిచ్చింది. %--%నా గురించి నేను ఎప్పుడూ ప్రతికూల పుకార్లు వినలేదు. నేను ఎదుర్కొన్న అన్ని పుకార్లు మంచివి.. సానుకూలమైనవి.. అవి నిజంగా నిజమని నేను ఆశిస్తున్నాను%--% అని తెలిపింది. బాలకృష్ణ సరసన అఖండలో మొదటిసారి నటించిన ప్రగ్యకు ఇప్పుడు %చీదీఖ% 109లో నటించే అవకాశం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి బాబి కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. బాబి డియోల్ ఇందులో విలన్ పాత్రధారి. నందమూరి బాలకృష్ణతో కలిసి పనిచేసిన ప్రగ్య తాజా ఇంటర్వ్యూలో భాషతో సంబంధం లేకుండా అన్ని పరిశ్రమల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నానని క్లారిటీ నిచ్చింది. ఖేల్ ఖేల్ మే చిత్రంలో అక్షయ్ కుమార్, తాప్సీ పన్ను, ఫర్దీన్ ఖాన్, వాణి కపూర్, అమ్మీ విర్క్, ఆదిత్య సీల్, ప్రగ్యా జైస్వాల్ తదితరులు నటించిన మల్టీస్టారర్. ముదస్సర్ అజీజ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఖేల్ ఖేల్ మేను టి-సిరీస్-వకావో ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఆసక్తికరంగా శ్రద్ధా కపూర్ నటించిన స్త్రీ 2 కూడా అదే రోజున విడుదల కానుంది. స్త్రీ 2 చిత్రాన్ని టి-సిరీస్ ఫిల్మ్స్, వకావో ఫిల్మ్స్, కెకెఎమ్ ఫిల్మ్స్ ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మించాయి.

## ఉలఝ్‌తో ముందుకొచ్చిన జాన్వీ

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ శుక్రవారం ఉలఝ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, కథల ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యాలు చేశారు. 'కెరీర్‌ను మార్చే అవకాశమైనా.. జుట్టు లేకుండా కనిపించే పాత్రను అంగీకరించను అన్నారు. 'ఎలాంటి పాత్రలో నటించకూడదని నిర్ణయించుకున్నారు?' అని యాంకర్ అడగ్గా జాన్వీ స్పందించారు. హెయిర్ లేకుండా నటించాల్సి వస్తే నేనెప్పుడూ సున్నితంగా తిరస్కరిస్తా. ఎంత కష్టమైన పాత్రైనా చేస్తాను కానీ జుట్టు లేకుండా కనిపించేందుకు ఇష్టపడను. 'ఉలఝ్'లోని పాత్ర కోసం దర్శకుడు నా హెయిర్‌ను కొంత కట్ చేయాలని సూచించారు. అందుకు నేను ఆయనతో గొడవపడ్డా నా తొలి సినిమా 'ధడక్' కోసం జుట్టు కత్తిరించుకున్నా. 'ఎందుకిలా చేశావ్?' అంటూ మా అమ్మ అరిచింది. ఏ రోల్ కోసమైనా హెయిర్ కట్ చేసుకోవద్దని చెప్పింది. నా జుట్టంటే ఆమెకు అంత ఇష్టం. మూడ్రోజులకోసారి ఆయిల్ రాసి మసాజ్ చేస్తది. అమ్మ కారణంగానే హెయిర్ కట్ చేసుకోను' అని అంది జాన్వీకపూర్. గుల్షన్ , జాన్వీకపూర్, రోషన్ మాథ్యు కలిసి నటించిన చిత్రమిది. దేశభక్తి కథాంశంతో ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్‌గా రూపొందింది. జాతీయ అవార్డు గ్రహీత సుధాన్షు సరియా దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఆమె తెలుగులో దేవర చిత్రంలో నటిస్తోంది. రెండు పార్టులుగా ఈ చిత్రం తెరకెక్కనుంది. తదుపరి రామ్‌చరణ్, సానా బుచ్చిబాబు కాంబోలో తెరకెక్కే చిత్రంలో ఆమె అవకాశం అందుకుంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986